శనివారం
15-07-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 24
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

క్యూబాపై ఈయూ చర్యలు గర్హనీయం

క్యూబాను అణచివేసేందుకు, దాని ప్రతిష్ఠను దిగజార్చేందుకు యూరోపియన్ పార్లమెంటు కుట్రలు చేస్తోందని, ఇది గర్హనీయమని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) అగ్రనాయకులు వ్యాఖ్యానించారు. యూరోపియన్ పార్లమెంటు తాజా తీర్మానాన్ని తీవ్రంగా ఖండించారు.

2 లో

చరిత్రాత్మకం

నింగిలోకి దూసుకెళ్లిన చంద్రయాన్-3

• ప్రయోగం విజయవంతం • ఆగస్టు 23న చంద్రునిపైకి

ఇది మర్చిపోలేని రోజు: సోమనాథ్

చంద్రయాన్-3 విజయవంతంగా కక్ష్యలో చేరడంతో ఇస్రో చైర్మన్ సోమనాథ్ స్పందిస్తూ ఇది చరిత్రాత్మక రోజు అని అన్నారు. ప్రయోగం అనంతరం కేంద్రమంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. అన్ని ప్రక్రియలు సజావుగా జరిగితే ఆగస్టు 23 సాయంత్రం 5.47 గంటలకు చంద్రుడిపై ల్యాండర్ అడుగుపెట్టే అవకాశముందని తెలిపారు.



ప్రయోగాన్ని వీక్షించిన 30 వేల మంది

చంద్రయాన్-3 రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచి మేధావులు, విద్యార్థులు, అధికారులు, రాజకీయ నాయకులు విచ్చేయగా సుమారు 30 వేల మంది వరకు వీక్షించినట్లు తెలిసింది. మండుటెండను సైతం లెక్కచేయకుండా ప్రయోగం చూసేందుకు తరలివచ్చారు. విద్యార్థులు జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు.

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మళ్లీ సత్తా చాటుకుంది. అమెరికా, చైనా వంటి అగ్రదేశాల సరసన నిలిచింది. చంద్రునిపై పరిశోధనల కోసం ప్రతిష్ఠాత్మకంగా చంద్రయాన్-3 ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలకు తిరుపతి జిల్లా, శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్‌వీఎం-3 ఎం4 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ల్యాండర్, రోవర్, ప్రొపల్షన్ మాడ్యూల్‌ను మోసుకుని ఈ అత్యంత శక్తిమంతమైన రాకెట్ నింగిలోకి ఎగిరింది. సకాలంలో పేలోడ్‌ను మండించి తొలి రెండు దశలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. చంద్రుడి దిశగా వెళ్లేందుకు మూడో దశ పేలోడ్‌ను మండించింది. దీంతో మూడు దశలు ప్రణాళిక ప్రకారమే సజావుగా సాగాయి. అంతరిక్ష నౌకకు అవసరమైన ఎత్తుకు చేర్చేందుకు అవసరమైన

- మిగతా 2 లో

వరద బాధితుల్ని ఆదుకోండి

- ఆహారం, తాగునీరు, పాలు, మందులు ఇవ్వండి
- సముచిత నష్ట పరిహారాన్ని అందించండి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సీపీఐ డిమాండ్
- ఢిల్లీలో జాతీయ సమితి సమావేశాలు ప్రారంభం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తూ ఆకస్మిక వరదలు సంభవించడంతో భారీగా నష్టం వాటిల్లడంపై భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆందోళన వ్యక్తంచేసింది.

వరద బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. బాధితులకు ఆహారం, తాగునీరు, పాలు, మందులు, సముచిత నష్ట పరిహారాన్ని అందించాలని డిమాండ్ చేసింది. భవిష్యత్‌లో వరదలతో జరిగే నష్ట నివారణకు తగు చర్యలను తీసుకోవాలని సూచించింది. వరద నీటి నిర్వహణకు మెరుగైన మౌలిక వసతులకు తగు విధమైన ఏర్పాట్లు జరగాలని పేర్కొంది. దేశ ఫెడరల్ వ్యవస్థ దృష్ట్యా భవిష్యత్ ప్రణాళికలు రూపొందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. మూడు రోజులు జరిగే సీపీఐ జాతీయ సమితి సమావేశాలు శుక్రవారం న్యూఢిల్లీలో ప్రారంభమయ్యాయి. సమావేశం సీపీఐ తెలంగాణ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన ప్రారంభం కాగా పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా దేశ రాజకీయ పరిణామాలపై నివేదికను ప్రవేశపెట్టారు. జాతీయ సమితి సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. వరద పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. వరద బాధితులకు ఆహారం, తాగునీరు, పాలు, మందులు సత్వరమే అందాలని తీర్మానించారు.

'హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాలు వరద గుప్పిట్లో ఉన్నాయి. మెరుపు వరదలతో వ్యవసాయానికే కాకుండా

- మిగతా 2 లో

జగన్ సర్కార్‌కు మరో

ఎదురుదెబ్బ

- అక్రమ ఇసుక తవ్వకాలపై ఎన్‌జీటీ తీర్పును సమర్థించిన సుప్రీం
- రాష్ట్ర ప్రభుత్వ స్టే అభ్యర్థనకు నిరాకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సర్కార్‌కు సుప్రీం కోర్టులో మరో ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో అడ్డగోలుగా కొనసాగుతున్న ఇసుక తవ్వకాలను నిషేధించాలంటూ ఇటీవల ఎన్‌జీటీ ఇచ్చిన తీర్పుపై స్టే ఇవ్వడానికి ధర్మాసనం నిరాకరిం చింది. గత మార్చి 23న ఇసుక తవ్వకాలపై ఎన్‌జీటీ విధించిన నిషేధాన్ని తొలగించాలని ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం ఎన్‌జీటీ తీర్పుపై స్టే ఇవ్వడానికి

- మిగతా 2 లో

అవినాశ్‌రెడ్డికి సమన్లు

ఆగస్టు 14న సీబీఐ కోర్టుకు హాజరుకావాలని ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో 8వ నిందితునిగా ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డికి సీబీఐ కోర్టు సమన్లు జారీ చేసింది.

ఈ కేసులో అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డి, అనుచరుడు ఉదయకుమార్ రెడ్డిపై ఇటీవల సీబీఐ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌ను సీబీఐ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఆమేరకు అవినాశ్‌రెడ్డిని 8వ నిందితుడిగా చేర్చిన సీబీఐ, ఆగస్టు 14న కోర్టు హాజరు కావాలని శుక్రవారం సమన్లు జారీ చేసింది. ఈ కేసులో 6వ నిందితుడిగా ఉన్న భాస్కరరెడ్డిని సీబీఐ అధికారులు ఏప్రిల్ 16వ తేదీన అరెస్ట్ చేశారు. 7వ నిందితునిగా ఉన్న ఉదయకుమార్ రెడ్డిని ఏప్రిల్ 14వ తేదీ అరెస్ట్ చేశారు. వీరిద్దరూ ప్రస్తుతం చంచల్ గూడా జైలులో ఉన్నారు. శుక్రవారం సీబీఐ కోర్టులో జరిగిన విచారణకు వీరిద్దరూ హాజరయ్యారు.

వీరందరికీ ఆగస్టు 14వరకు కోర్టు రిమాండ్ పొడిగించింది. ముందస్తు బెయిల్‌పై ఉన్న అవినాశ్‌రెడ్డిని ఆగస్టు 14న కోర్టుకు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యతను న్యాయస్థానం సీబీఐకి అప్పగించింది.

ఇదీ లోకం!

'మణిపూర్' కూడా ప్లాన్ చేయండి సార్ అక్కడ జనం మంటల్లో ఉన్నారు!

రాయలసీమ కరవు నివారణ ప్రాజెక్టుల పేరుతో

రూ.900 కోట్ల మళ్లింపుపై విచారణ చేపట్టాలి

- సీఎం జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాయలసీమ కరవు నివారణ ప్రాజెక్టుల పేరుతో రుణంగా తీసుకున్న రూ.900 కోట్లను ప్రైవేటు గుత్తేదారుకు మళ్లించడంపై సమగ్ర విచారణ జరిపించాలని, ప్రాజెక్టు పనుల వివరాలు, నిధుల బదలాయింపులపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్

- మిగతా 2 లో

ఇంగ్లండ్‌లో వైద్యులు భారీ సమ్మె

- ఐదు రోజులు విధులకు హాజరుకాని వేలాది మంది డాక్టర్లు
- దిగొచ్చిన బ్రిటన్ ప్రభుత్వం - జీతాలు పెంచుతూ ప్రకటన
- సమ్మెలు విరమించాలని అన్ని రంగాలకు పిలుపు
- ఇదే తుది నిర్ణయం-చర్చలకు తావు లేదని స్పష్టీకరణ

లండన్: ఆరోగ్య వ్యవస్థ చరిత్రలోనే అతిపెద్ద సమ్మె బ్రిటన్‌లో జరిగింది. వేతనాలు పెంచాలన్న డిమాండ్‌తో ఐదు రోజుల పాటు విధులను వేలాది మంది వైద్యులు బహిష్కరించారు. జూనియర్ వైద్యులు ఉదయం 7 గంటల నుంచి సమ్మెలో పాల్గొని 35శాతం వేతనాల్లో పెంపునకు డిమాండ్ చేశారు. 2008లో ఉన్నట్లుగానే జూనియర్ వైద్యుల జీతాల్లో 35శాతం పెంపుదల కోసం బ్రిటిష్ వైద్య సమాఖ్య గళమెత్తింది. మరోవైపు ఇంగ్లండ్‌వ్యాప్తంగా ఆసుపత్రుల్లో జూనియర్ వైద్యులపై పనిభారం పెరిగింది. కోవిడ్ మహమ్మారి నేపథ్యంలో చికిత్స కోసం వచ్చే రోగుల సంఖ్య రికార్డు స్థాయికి చేరింది. సమ్మెలు ప్రకటించినప్పుడు చర్చలకు పిలవని పద్ధతిని ప్రభుత్వం మార్చుకోవాలని బ్రిటన్ మెడికల్ అసోసియేషన్ నాయకుడు డాక్టర్ రాబర్ట్ లారెన్సన్, డాక్టర్ వివేక్ త్రివేది సూచించారు. బ్రిటన్‌వ్యాప్తంగా అనేక రంగాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వరుసగా సమ్మెలు చేస్తున్నారు. రైల్వే, వైద్య రంగంతో పాటు అనేక రంగాల సేవలు స్తంభించిపోయాయి. ఎన్నడూ లేని విధంగా జీవన వ్యయం పెరిగిపోవడంతో ఉద్యోగులు, కార్మికులు వేతనాల్లో పెంపును డిమాండ్ చేస్తూ సమ్మెలు చేస్తున్నారు. వేలాది మంది వైద్యులు తాజాగా విధులను బహిష్కరించారు. దీంతో రిషి సునాక్ ప్రభుత్వం మెట్టుదిగక తప్పలేదు. ప్రభుత్వ రంగ ఉద్యోగులు, కార్మికుల వేతనాలను పెంచేందుకు అంగీకరించింది. సమ్మెలను విరమించాలని పిలుపునిచ్చింది. వేతనాలను పెంచేందుకుగాను స్వతంత్ర సమీక్షా సంఘాలు చేసిన సిఫార్సులను ఆమోదించింది. అయితే ఇప్పుడు తీసుకున్నదే తుది నిర్ణయమని, దీని తర్వాత ఎలాంటి చర్చలు, బేరసారాలకు తావు ఉండబోదని, ఎన్ని సమ్మెలు చేసినా తమ నిర్ణయం మారదని రిషి సునాక్ తేల్చిచెప్పారు. వేతనాల పెంపును ప్రకటించారు. పోలీసుల జీతాల్లో ఏడు శాతం, టీచర్లకు 6.5శాతం, జూనియర్ డాకర్లకు 6శాతం, వచ్చే వారం సమ్మెకు పిలుపునిచ్చిన హాస్పిటల్ కన్సల్టెంట్ల జీతాలనూ 6శాతం మేర పెంచుతూ రిషి సునాక్ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. టీచర్ల సంఘాలు ఇప్పటికే పిలుపునిచ్చిన అన్ని సమ్మెలను విరమించుకోవాలని ప్రధాని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. తాజా ప్రకటనను ఉద్యోగులకు సంబంధించిన కొన్ని సంఘాలు స్వాగతించగా మరికొన్ని కంటితుడుపు చర్యగా పేర్కొన్నాయి. ఇది సంబరాలకు సమయం కాబోదని వెల్లడించాయి.

క్యూబాపై ఈయూ చర్యలు గర్హనీయం : కేకేఈ

ఏథెన్స్: క్యూబాను అణచివేసేందుకు, దాని ప్రతిష్ఠను దిగాజార్చేందుకు యూరోపియన్ పార్లమెంటు కుట్రలు చేస్తోందని, ఇది గర్హనీయమని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) అగ్రనాయకులు వ్యాఖ్యానించారు. యూరోపియన్ పార్లమెంటు తాజా తీర్మానాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. క్యూబా ప్రజల విజయాలను తుంగలో తొక్కేలా తీర్మానం ఉందన్నారు. ప్రపంచ ప్రజల ఎదుట క్యూబా పరువు తీయాలన్న ఈయూ దీర్ఘకాలిక లక్ష్యానికి ఇది అద్దం పడుతోందని వ్యాఖ్యానించారు. క్యూబా ప్రజలపై అదనపు ఆంక్షలను ఈ తీర్మానం డిమాండ్ చేస్తోందన్నారు. ఆరు దశాబ్దాలుగా అనేక రకాల ఆంక్షలను అమెరికా, దాని మిత్రపక్షాలు విధిస్తూ క్యూబా ప్రజల హక్కులను, సాధించుకున్న విజయాలు, విప్లవాలు కాలరుస్తున్నట్లు తెలిపారు. నిత్యావసరాలు, మౌలిక వసతులకూ వారిని దూరం చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. క్యూబాకు, ఆ దేశ ప్రజలకు సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు. క్యూబాపై అన్ని రకాల ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అందుకోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. అలాగే క్యూబా ప్రజల హక్కులకు గుర్తింపు, బాహ్య జోక్యంలేని భవిష్యత్ కోసం పోరాడతామని కేకేఈ నాయకులు ఉద్ఘాటించారు.

నైజీరియాలో ఆహార భద్రతపై అత్యవసర పరిస్థితి

అబుజా: దిగిరాని ద్రవ్యోల్బణంతో నైజీరియాలో అత్యవసర పరిస్థితిని ఆ దేశాధ్యక్షుడు బోలా తినుబు ప్రకటించారు. ఆఫ్రికాలోనే అధిక జనాభాగల దేశంగా నైజీరియా ఉంది. ఇక్కడ నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. అధిక ద్రవ్యోల్బణం ఆహార భద్రతకు ముప్పుగా మారింది. దీంతో ఎమర్జెన్సీని ప్రకటిస్తూ అధ్యక్షుడి కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. 'పెరుగుతున్న ధరల, ప్రజలపై వాటి ప్రభావం గురించి అధ్యక్షుడికి తెలుసు. అందుబాటు ధరలు ఆహార వస్తువులు లభించకపోవడం సవాల్‌గా మారింది. దేశంలోని అనేక భాగాల్లో ప్రజలు ఏమి కొనలేని ఏమి తినలేని పరిస్థితిని అనుభవిస్తున్నారు' అని రాజధాని అబుజాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడికి అధికార ప్రతినిధి దెలే అకాలే వెల్లడించారు. 2021 జనవరి నుంచి నైజీరియాలో ద్రవ్యోల్బణం బాగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే ధరలను తగ్గించేందుకే కాకుండా భవిష్యత్‌లో ఆహార సంక్షోభం ఎదురు కాకుండా ఉండేందుకుగాను తగు విధమైన చర్యలకు ప్రభుత్వం పూనుకున్నట్లు అకాలే తెలిపారు. సామాన్యులకు ఆహార పదార్థాలు అందుబాటు ధరలకే లభించేలా కసరత్తు జరుగుతోందని చెప్పారు. ఎరువులు, రైతులకు గింజలు వంటివి వెంటనే విడుదల చేయడం ద్వారా సబ్సిడీ తొలగింపు ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నాన్ని ప్రభత్వం చేస్తుందని తెలిపారు. సాగుభూముల నీటిపారుదల, ఏడాది మొత్తం పండే పంటలకు హామీ ఉండేలా వ్యవసాయశాఖ, జల వనరుల శాఖ సమన్వయం చేసుకోవాలని అధ్యక్షుడు ఆదేశాలిచ్చినట్లు అకాలే వెల్లడించారు. ఉన్న వనరులను సమకూర్చి సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ఆహార భద్రతపై అత్యవసర పరిస్థితిని అధ్యక్షుడు ప్రకటించినట్లు ఆయన చెప్పారు.

రూ.900 కోట్ల మళ్లింపుపై విచారణ చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. రాయలసీమ ప్రాంతంలో కరవును నివారించేందుకు ఎత్తిపోతల పథకాల నిర్మాణం పేరుతో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం భారీ అవకతవకలు పాల్పడినట్లు తెలుస్తోంది. రూ.3,825 కోట్లతో రాయలసీమలో కరవు నివారణ కోసం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపడుతున్నామంటూ 70 శాతం అప్పుగా ఇవ్వాలని ఆర్‌ఈసీ, పీఎఫ్‌సీల నుంచి రూ.900 కోట్లు అప్పుగా తీసుకుంది. అలా రుణంగా తీసుకున్న రూ.900 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా అధికార పార్టీకి అత్యంత సన్నిహితుడైన వ్యక్తి గుత్తేదారుగా ఉన్న సంస్థ ఖాతాలోకి పంపేసింది. ఏ పనుల కోసం నిధుల బదలాయింపు జరిగిందో, కనీసం ఆయా పనులు జరిగాయో లేదో కూడా రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించుకోకుండా నిధులు ఇచ్చేయడం సరైందికాదు. ఇందులో భారీ కుంభకోణం ఉన్నట్లుగా గోచరిస్తున్నది. ఇలా ప్రజాధనం దుర్వినియోగంపై, రాష్ట్ర ఖజానా లెక్కలకు జవాబుదారీతనం లేకపోవడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నాం. ప్రభుత్వానికి వచ్చే ఆదాయమైనా, తీసుకునే అప్పులైనా మొదట కన్సాలిడేటెడ్ ఫండ్‌లోకి వచ్చిన తర్వాతే ఖర్చు పెట్టాలి. కనీసం రాయలసీమ కరవు నివారణ ప్రాజెక్టుల అభివృద్ధి సంస్థ ఖాతాలోకి కూడా ఆ నిధులు రాలేదు. అలాకాకుండా రాష్ట్ర ప్రభుత్వం అప్పుగా తీసుకున్న వందలాది కోట్ల రూపాయలను కేవలం మూడు రోజుల్లోనే ఒక గుత్తేదారు ఖాతాలోకి పంపటం నిబంధనలకు విరుద్ధం. ఇది ప్రజాధనాన్ని దోచిపెట్టటమే. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దీనిపై తక్షణమే స్పందించి రాయలసీమ కరవు నివారణ ప్రాజెక్టుల పనులకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలి. రూ.900 కోట్ల మళ్లింపు అవకతవకలపై నిజానిజాలు వెలికితీయాలి. దీనిపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

వరద బాధితుల్ని ఆదుకోండి

(మొదటిపేజీ తరువాయి)

పాడిపరిశ్రమకు నష్టం జరిగింది. భారీగా ప్రాణ-ఆస్తి నష్టం సంభవించింది.

జనజీవనం అస్తవ్యస్థమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయక చర్యలు అరకొరగానే ఉన్నాయి. ముంపుకు గురైన ప్రజలకు సాయం అందడంలేదు. సరిపడ ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ప్రభావిత ప్రాంతాలకు మోదీ ప్రభుత్వం పంపలేదు. బాధితులకు ఆహారం, తాగునీరు, పాలు, మందులు తదితరాలు అందడంలేదు' అని తీర్మానం పేర్కొంది. నీట మునిగిన పంటలకు సముచిత నష్టపరిహారం ఇవ్వాలని, పాడిపశువులు, ఆస్తులను నష్టపోయిన వారిని ఆదుకోవాలని, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తగు పరిహారం ఇవ్వాలని, సాగు రుణాలను మాఫీ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది.

రైతులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-కదిరి : రైతాంగ సమస్యలు పరిష్కరించాలంటూ సీపీఐ, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని వేమారెడ్డి సర్కిల్ వద్ద సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్.కె.ఇసాక్ అధ్యక్షతన రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయిన ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జె.వి.రమణ, ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ అన్ని పంటలకు బీమాను వర్తింపజేసి, మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విపరీతంగా ధరలు పెరగడంతో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతులు పంటలు పెట్టడానికి ముందుకు రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. పెట్టుబడి పెట్టాలన్న అనేక మంది రైతుల దగ్గర డబ్బులు లేక వ్యవసాయాన్ని వదులుకొని పక్క రాష్ట్రాలకు కూలీగా వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. తక్షణం ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతు పెట్టుబడి సహాయంగా రూ.13,500 సరిపోదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న తరహాలో ఎకరాకు రూ.10 వేల చొప్పున రెండు ఎకరాలకు రూ.20 వేలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రతి రైతు రూ.2.45 లక్షల రుణభారంతో ఉన్నారని, దేశంలో రైతు ఆత్మహత్యలలో మన రాష్ట్ర మూడో స్థానంలో ఉందని, వీరిలో అత్యధికులు పేద, కౌలు రైతులే ఉన్నారని తెలిపారు. కనీస మద్దతు ధరలకు కూడా రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోలేని దుస్థితి ఏర్పడిందని అన్నారు. రూ.2 లక్షల వరకు ప్రతి రైతుకు రుణ మాఫీ చేయాలన్నారు. కేరళ ప్రభుత్వ తరహాలో రుణ విముక్తి చట్టాన్ని తీసుకురావాలని, 50 సంవత్సరాలు పూర్తయిన ప్రతి రైతుకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రతి పంటకు వాతావరణ బీమా వర్తింప చేయాలని, సాగు చేస్తున్న ప్రతి రైతుకు సాగు పట్టాలు ఇవ్వాలని, పాడి పశువులకు బ్యాంకులలో 50 శాతం సబ్సిడీతో రుణాలు, స్ప్రింక్లర్స్, డ్రిప్ 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని, డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

చరిత్రాత్మకం

(మొదటిపేజీ తరువాయి)

ఈ దశలు పూర్తి కావడంతో చంద్రుని దిశగా ప్రయాణాన్ని చంద్రయాన్-3 ప్రారంభించింది. ప్రయోగించిన 16 నిమిషాలకు రాకెట్ చివరి భాగంలోని క్రయోజనిక్ నుంచి విడిపోయింది. 42 రోజుల పాటు ప్రయాణించి ఆగస్టు 23వ తేదీ నాటికి చంద్రునిపైకి చంద్రయాన్-3 చేరుతుంది. చంద్రయాన్-3లో ఉన్న మాడ్యూల్, ల్యాండర్, రోవర్ చంద్రునిపై పరిశోధనలో కీలకపాత్ర పోషించనున్నాయి. అయితే చంద్రయాన్-3 పురోగతిని బెంగళూరులోని మాస్టర్ కంట్రోల్ సెంటర్ పర్యవేక్షిస్తుంది. మొత్తం 3.5లక్షల కిలోమీటర్లు ప్రయాణించి చంద్రయాన్-3 చంద్రుని కక్షలోకి చేరుతుంది. ప్రపొల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ విడిపోయి చంద్రుడికి రెండో వైపు దక్షిణ ధ్రువ ప్రాంతంలో నెమ్మదిగా దిగుతుంది. ఆగస్టు 23వ తేదీ సాయంత్రం 6.24 గంటలకు చంద్రయాన్-3లో ఒక భాగమైన ల్యాండర్ చంద్రుడి మీదకు చేరుకుంటుంది. ల్యాండర్ చంద్రుడి ఉపరితలంపై దిగిన నాలుగు గంటల తర్వాత రోవర్ బయటకు వస్తుంది. ప్రతి సెకనుకు ఒక సెంటీమీటర్ వేగంతో రోవర్ కదులుతుంది. రోవర్ ఒక లూనార్ డే (చంద్రరోజు) పనిచేస్తుంది. లూనార్ డే అంటే భూమి మీద కొలిస్తే 14 రోజులు. ఈ కాలంలో 500 మీటర్లు ప్రయాణించి చంద్రుడి ఉపరితలంపై పరిశోధించి కంట్రోల్ సెంటర్‌కు సమాచారాన్ని అందిస్తుంది.

ప్రముఖుల అభినందనలు

చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంపై ఇస్రో శాస్త్రవేత్తలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, క్రికెటర్ సచిన్ తదితరులు అభినందనలు తెలిపారు. జాబిల్లి దిశగా చంద్రయాన్-3 విజయవంతంగా కక్ష్యలోకి చేరడం భారత అంతరిక్ష పరిశోధనలో మరో మైలురాయని ద్రౌపది ముర్ము అన్నారు. ఈ విజయం కోసం శ్రమించిన ఇస్రో బృందానికి, శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేశారు. అంతరిక్ష శాస్త్ర, సాంకేతికతపై దేశం నిబద్ధతను ఈ ప్రయోగం చాటిచెబుతోందని ఆమె పేర్కొన్నారు. భారతదేశ అంతరిక్ష చరిత్రలో చంద్రయాన్-3 కొత్త అధ్యాయాన్ని లిఖించిందని, ఇది ప్రతి భారతీయుడి కలలు, ఆశయాలను ఉన్నతంగా ఎగురవేస్తుందని, ఈ మహత్తర విజయం మన శాస్త్రవేత్తల నిర్విరామ అంకితభావానికి నిదర్శనమని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. మనలో వందకోట్ల కంటే ఎక్కువ మంది గర్వంతో ఆకాశం వైపు చూస్తున్నారని రాహుల్ గాంధీ అన్నారు. చంద్రయాన్-3 మిషన్ విజయవంతమైతే చంద్రుని ఉపరితలంపై అంతరిక్ష నౌకను దించిన నాల్గవ దేశంగా భారత్ నిలుస్తుందన్నారు. ఇస్రో బృందానికి అభినందనలు తెలుపుతూ రాహుల్ ట్వీట్ చేశారు. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం భారతీయులందరికీ మరపురాని రోజు...జై హింద్! అంటూ సచిన్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. చంద్రయాన్-3ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టడంతో భారత్ చరిత్రాత్మకమైన అంతరిక్ష ప్రయాణాన్ని ప్రారంభించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. దేశం గర్వపడే రోజు అని చెబుతూ చరిత్రాత్మక ఘట్టంలో భాగస్వామి కావడం ఆనందంగా ఉందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. ఇస్రో చైర్మన్ సోమనాథ్ మాట్లాడుతూ శాస్త్రవేత్తల శ్రమ ఫలించిందన్నారు.

అలాగే, తిరుపతి ఎంపీ గురుమూర్తి, సులూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య, సులూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, వైఎస్ఆర్సీపీ పట్టణ అధ్యక్షుడు కలతూరు శేఖర్‌రెడ్డి, చెంగాలమ్మ పరమేశ్వరి దేవస్థాన చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, శ్రీసిటీ అధినేత సన్నారెడ్డి రవీంద్రారెడ్డి తదితరులు ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అభినందనలు

విశాలాంధ్ర-విజయవాడ: ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం శుక్రవారం విజయవంతమైంది. దీంతో ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బందికి సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అభినందలు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. 'శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఎల్‌వీఎం-3 ఉపగ్రహ వాహకనౌక ద్వారా బాహుబలి రాకెట్ చంద్రయాన్-3ను ఇస్రో శాస్త్రవేత్తలు విజయవంతంగా ప్రయోగించారు. ప్రపంచంలో ఏ దేశం చంద్రుడి రెండో వైపుకు ల్యాండర్, రోవర్‌లను పంపలేదు.

కానీ భారత్ దానిని చేసిచూపడం గర్వకారణం. చంద్రునిపై అడుగు పెట్టాలన్న భారత చిరకాల స్వప్నం కార్యరూపం దాల్చింది. ఈ ప్రయోగం వల్ల భారత కీర్తి మరింత పెరిగింది' అని పేర్కొన్నారు. చంద్రయాన్-3 ప్రయోగం కోసం అహర్నిశలూ కృషిచేసిన ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్, శాస్త్రవేత్తలకు, ఇస్రో సిబ్బందికి అభినందనలు తెలిపారు.

మహాశక్తితో జీవితాల్లో వెలుగులు

చైతన్య రథయాత్ర ప్రారంభంలో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తమ పాలనలోనే మహిళా సంక్షేమం సాధ్యమైందని, మహాశక్తి పథకం మరిన్ని అద్భుత ఫలితాలు సృష్టిస్తుందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మహిళా సంక్షేమం గురించి తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం ముందు...ఆవిర్భావం తరవాత అని చూడాల్సిన అవసరం ఉందన్నారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో పార్టీ మేనిఫెస్టో మహాశక్తి పథకాలపై శుక్రవారం సదస్సు నిర్వహించారు.

అనంతరం మహాశక్తి చైతన్య రథయాత్రను చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా నేతలు ఈ వాహనాల్లో వేలాది గ్రామాల్లో పర్యటించనున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో నేతలు ఇంటింటికీ వెళ్లడంతో పాటు ప్రత్యేక సమావేశాలు, చర్చా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 'నా మహాశక్తి రథసారథులు ఆడబిడ్డలే. మొదటి నుంచి తెలుగుదేశం పార్టీ మహిళా సాధికారతకు పెద్దపీట వేసింది. మహిళల జీవితాలు మార్చడానికి నాంది మహాశక్తి. 2.50 కోట్ల మంది మహిళలు ముందుకొచ్చి అవినీతి ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి. అన్ని సమస్యలకు పరిష్కారం మహాశక్తి సంకల్పం. మహాశక్తి కంకణం ధరించి 41 రోజులు దీక్ష చేస్తామని సంకల్పం చేయండి. ఇంటింటికీ వెళ్లి మహాశక్తి పథకాలపై వివరించండి. ప్రజలను చైతన్య వంతులను చేయండి. నా ఆడబిడ్డలను ఒక మహాశక్తిగా తయారు చేయాలన్నది నా సంకల్పం. వచ్చే ఎన్నికల్లో మహిళా శక్తి ఏంటో జగన్ రెడ్డికి చూపించాలి' అని చంద్రబాబు పిలుపునిచ్చారు. '1986లో మహిళలకు ఎన్టీఆర్ ఆస్తిహక్కు కల్పించారు. ఆ తర్వాత కాలంలో ఆస్తిహక్కును దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారు. ఆడపిల్లలకు పెళ్లి చేసి ఒక అయ్య చేతిలో పెడితే చాలనుకునే రోజుల్లోనే ఎన్టీఆర్ పద్మావతి మహిళా యూనివర్సిటీని స్థాపించి...విద్యను ప్రోత్సహించారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేశారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకూ పాఠశాలలు, కళాశాలలు తీసుకొచ్చాం. విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు ఇచ్చాం. ఉద్యోగాల్లో, కాలేజీల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేశాం. మన జనాభాలో సగం మహిళలే. మీకు తిరుగులేదు. శక్తి సామర్థ్యాల్లో మగవాళ్లకు ఏ మాత్రం తీసిపోరని నిరూపితమైంది. మహిళా సంక్షేమానికి గతంలో అనేక కార్యక్రమాలు అమలు చేశాం. ఆర్టీసీ బస్సుల్లో మహిళలను కండక్టర్లుగా నియమించాం. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తల్లికి వందనంలో భాగంగా ఇంట్లో ఎందరు పిల్లలు ఉంటే అందరికీ ఏడాదికి రూ.15 వేలు ఇస్తాం. మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం. విద్యను ప్రోత్సహించేందుకు మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తాం. ఆడబిడ్డ నిధి కింద 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న వారికి నెలకు రూ.1500 నేరుగా ఖాతాల్లో వేస్తాం. ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికీ ఈ పథకం అమలవుతుంది. సంపద సృష్టించే మంత్ర దండం టీడీపీ' అని చంద్రబాబు అన్నారు.

వలంటీర్లు రాజకీయం చేయొద్దు

'వలంటీర్లకు నేను ఒక్కటే చెపుతున్నా...మీరు రాజకీయం చేయకండి... సైకో చెప్పిన పనులు చేయకండి. వలంటీర్లు ఇళ్లలోకి చొరబడుతు న్నారని తెలిసింది. ప్రజల వ్యక్తిగత వివరాలు తెలుసుకుంటున్నారు... ఏంటీ వ్యవహారాలు జగన్ రెడ్డీ? చెప్పుతో కొట్టేవారు లేక ప్రజలను ఇలాంటి ప్రశ్నలు అడుగుతున్నారు. వ్యక్తిగత అంశాలపై ఆరా తీస్తున్నారు. ఆడపిల్లల వ్యక్తిత్వంపై నీచంగా మాట్లాడే, పోస్టులు పెట్టే వైసీపీ నేతలకు దీటుగా సమాధానం చెప్పండి. సోషల్ మీడియాలో మిమ్మల్ని ఏమన్నా అంటే చెప్పు చూపించండి.

మీ చెప్పు ఫొటో తీసి వారికి పంపండి. తప్పు చేసిన ప్రతి వైసీపీ నేతనూ బోనెక్కిస్తా. మీ తప్పులకు వడ్డీతో సహా చెల్లిస్తా' అని చంద్రబాబు హెచ్చరించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షులు వంగలపూడి అనిత, ఇతర ముఖ్యనేతలు పాల్గొన్నారు.

సార్క్ ప్రధాన కార్యదర్శిగా గోలమ్ సర్వర్

ఢాకా: దక్షిణాసియా ప్రాంతీయ సహకార సమాఖ్య (సార్క్) నూతన ప్రధాన కార్యదర్శిగా బంగ్లాదేశ్‌కు చెందిన దౌత్యాధికారి గోలమ్ సర్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు విదేశాంగ వ్యవహారాల శాఖ ప్రకటించింది. ఈ పదవి బాధ్యతలు చేపట్టే 15వ వ్యక్తిగా మూడవ బంగ్లాదేశీగా సర్వర్ నిలిచారు. బంగ్లాదేశ్ సివిల్ సర్వీస్ (విదేశీ వ్యవహారాల) 10వ బ్యాచ్‌కు చెందిన సర్వర్ 1991లో సర్వీస్‌లో చేరారు. ఆ తర్వాత ఆయన స్వదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ అనేక పదవులు చేపట్టారు. ప్రస్తుతానికి మలేసియాకు బంగ్లాదేశ్ దౌత్యాధికారిగా ఉన్నారు. అంతకుముందు ఒమన్, స్వీడెన్ దేశాలకు బంగ్లాదేశ్ రాయబారిగా, జెడ్డాకు కౌన్సుల్ జనరల్‌గా విధులు నిర్వర్తించారు. యాంగాన్, కౌలాలంపూర్, ఖాట్మండు, వాషింగ్టన్‌లో బంగ్లాదేశ్ మిషన్లలో పనిచేశారు.

గ్రూప్-1 ఫలితాల విడుదల

2 నుంచి ఇంటర్వ్యూలు: ఏపీపీఎస్సీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ద్వారా భర్తీ చేయబోయే గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ పోస్టులకు ఇంటర్వ్యూల షెడ్యూలు కూడా ఖరారైంది. ఆగస్టు 2వ తేదీ నుంచి ఇంటర్వ్యూలు జరుగుతాయని ఏపీపీఎస్సీ కార్యదర్శి జె.ప్రదీప్ కుమార్ శుక్రవారం ప్రకటించారు. జూన్ 3 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన మెయిన్స్ పరీక్షలకు మొత్తం 5038 మంది హాజరయ్యారు. వారిలో 259 మంది ఇంటర్వ్యూలకు అర్హత సాధించారు. మొత్తం 111 గ్రూప్-1 పోస్టులకుగాను 259 మంది ఇంటర్వ్యూకు అర్హత సాధించగా వీరిలో 39 మంది స్పోర్ట్స్ కోటా నుంచి ఎంపికయ్యారు. గ్రూప్-1 పరీక్ష జరిగిన 34 రోజుల్లోనే ఫలితాలను విడుదల చేసే విధంగా ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరించారు. నోటిఫికేషన్ నంబరు 28/2022 ప్రకారం రాత పరీక్ష అనంతరం ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థుల తాత్కాలిక జాబితా, స్పోర్ట్సు కోటా కింద ఎంపికైన వారి జాబితాను ధ్రువీకరించారు. ఆయా జాబితాలను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఆగస్టు 2 నుంచి అన్ని పనిదినాల్లో ఏపీపీఎస్సీ కార్యాలయం (విజయవాడలో ఇందిరా గాంధీ మున్సిపల్ కాంప్లెక్స్ ఎదురుగా) ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయి. స్పోర్ట్స్ విభాగంలో అర్హత కోసం ధ్రువీకరణ పత్రాల పరిశీలనను ఈనెల 27వ తేదీ నుంచి ఏపీపీఎస్సీ కార్యాలయంలో నిర్వహిస్తారు. అభ్యర్థులు పూర్తి వివరాలను కమిషన్ వెబ్‌సైట్ www.psc.ap.gov.inలో పొందవచ్చు.

జగన్ సర్కార్‌కు మరో ఎదురుదెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

నిరాకరించింది. జగన్ ప్రభుత్వం ఇసుక తవ్వకాలను గంపగుత్తగా జయప్రకాశ్ పవర్ వెంచర్స్ లిమిటెడ్ పరం చేసింది. పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలతో ఏపీలో ఇసుక తవ్వకాలను జయప్రకాశ్ పవర్ వెంచర్స్ లిమిటెడ్ చేపట్టింది. ఏపీ ప్రభుత్వ వైఖరిని ఎన్‌జీటీ తప్పుపడుతూ ఇసుక తవ్వాలపై నిషేధం విధించింది. ఎన్‌జీటీ తీర్పును సుప్రీం కోర్టు సమర్థిస్తూ ఆ తీర్పును యథాతథంగా అమలు చేయాలని ఆదేశించింది. బి2 కేటగిరీ ఇసుక రీచ్‌లలో పాక్షికంగా యంత్రాలతో ఇసుక తవ్వకానికి అనుమతి ఇవ్వడం చట్ట విరుద్ధమని ఎన్‌జీటీ పేర్కొంది. బి1, బి2 కేటగిరీల కింద ఇసుక తవ్వకాల కోసం ఇప్పటికే ఇచ్చిన అన్ని రకాల పర్యావరణ అనుమతులను పరిశీలన చేయాలని ఎన్‌జీటీ ఆదేశించింది. రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ పర్యావరణ అనుమతులను పునః పరిశీలన చేయాలని సూచించింది. రాష్ట్రంలో ఇసుక రీచ్‌ల పరిధిలో పర్యావరణ విధ్వంసం పరిశీలన, అంచనా కోసం ఎన్‌జీటీ నిపుణుల కమిటీని నియమించింది. ఇసుక తవ్వకాలతో పర్యావరణానికి జరిగిన నష్టాన్ని గుర్తించాలని కూడా నిపుణుల కమిటీని ఆదేశించింది. రివర్ బెడ్లు, నదీ తీరాల్లో భారీ యంత్రాలతో మైనింగ్ చేసుకోవచ్చంటూ అనుమతివ్వడంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పర్యావరణ శాఖ కార్యదర్శిని ఆదేశించింది. ఎన్‌జీటీ విధించిన రూ.18 కోట్ల జరిమానాపై మాత్రమే సుప్రీం ధర్మాసనం స్టే విధించింది. ప్రతివాదులైన నాగేంద్ర కుమార్, హేమకుమార్‌కు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది.

పంతం నెగ్గించుకున్న అజిత్

ఆర్థిక మంత్రిగా బాధ్యతల స్వీకారం

ఎన్‌సీపీ మంత్రులకు శాఖల కేటాయింపు

ముంబై : మహారాష్ట్ర మంత్రివర్గంలో ఈ నెల 2న చేరిన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) ఎమ్మెల్యేలకు ఎట్టకేలకు శుక్రవారం శాఖల కేటాయింపు జరిగింది. ఆ పార్టీ సీనియర్ నేత అజిత్ పవార్ పట్టుబట్టి మరీ ఆర్థిక శాఖను సొంతం చేసుకున్నారు. కేబినెట్‌లో కీలకమైన ఆర్థిక, ప్రణాళిక శాఖను అజిత్ పవార్‌కు కేటాయించారు. వెంటనే ఆయన ఈ బాధ్యతలు స్వీకరించారు. ఆర్థిక శాఖ ఇంతవరకూ బీజేపీ సీనియర్ నేత, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ చేతిలో ఉంది. అజిత్ పవార్‌తో పాటు ప్రమాణస్వీకారం చేసిన ధనంజయ్ ముండేకు వ్యవసాయం. దిలీప్ వాల్సే పాటిల్ సహకార మంత్రిగా ఉంటారు. హసన్ ముష్రిఫ్ (వైద్య విద్య), ఛగన్ భుజబల్ (ఆహారం, పౌర సరఫరాలు), ధర్మారావ్ అత్రమ్ (ఆహారం, ఔషధాల నిర్వహణ), సంజయ్ బన్సోడే (క్రీడలు), అదితి తత్కరే (మహిళా, శిశు అభివృద్ధి), అనిల్ పాటిల్ (సహాయ, పునరావాస, విపత్తు నిర్వహణ) శాఖలు పొందిన ఇతర మంత్రులని పేర్కొంది. తొమ్మిది మంది ఎన్‌సీపీ మంత్రుల చేరికతో మహారాష్ట్రలో 29 మంది కేబినెట్ మంత్రులు ఉన్నారు. అజిత్ పవార్‌కు ఆర్థిక, ప్రణాళిక శాఖ కేటాయింపులపై షిండే నేతృత్వంలోని శివసేన ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. తత్కరే చేరికతో తొలిసారిగా షిండే ప్రభుత్వంలో ఒక మహిళా ఎమ్మెల్యేకు మంత్రివర్గంలో చోటు లభించింది. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ప్రభుత్వంలో, తత్కరే అనేక శాఖలతో రాష్ట్ర మంత్రిగా ఉన్నారు.

ధరల్లో హెచ్చు తగ్గుల నివారణకు

టమాటా, ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్లు

- వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం విస్తృతం
- ఉద్యాన పంటల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రోత్సాహం
- వ్యవసాయ శాఖ సమీక్షలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులకు గురయ్యే టమాటా, ఉల్లిలాంటి పంటల ప్రాసెసింగ్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. ముఖ్యంగా ఈ పంటల సాగు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టాలని, అలాగే మహిళలతో నడిచే సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్లను తీసుకొచ్చే ప్రయత్నం చేయడం ద్వారా మహిళల స్వయం ఉపాధికి ఉపయోగపడు తుందన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలపై క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ సమీక్ష శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సన్నద్ధతతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల్లో చేపడుతున్న కార్యక్రమాల ప్రగతిని సీఎంకు అధికారులు వివరించారు. ఇ-క్రాపింగ్‌లో జియో ఫెన్సింగ్ ఫీచర్ కొత్తగా ప్రవేశపెట్టామని, ఎప్పటికప్పుడు వివరాలను అప్‌లోడ్ చేస్తున్నామని తెలిపారు. దీనిపై సీఎం మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో డ్రోన్లను విస్తృతంగా వినియోగించాలని, పురుగుమందుల పిచికారితో పాటు భూసార పరీక్షలు కూడా వీటి ద్వారా నిర్వహించే స్థాయికి ఎదగాలన్నారు. బహుళ ప్రయోజనకారిగా డ్రోన్లను వినియోగించుకోవడం వల్ల వ్యవసాయ రంగానికి, రైతులకు మరింత మేలు జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన అగ్రి ల్యాబ్‌ల ద్వారా 2.2 లక్షల నమూనాలు సేకరించి రైతులకు ఫలితాలు అందిస్తున్నామని అధికారులు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు ఇవ్వడంపై ప్రత్యేక దృష్టిపెట్టామని తెలియజేయగా, వీరికి రైతు భరోసా అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. 10 వేల ఆర్బీకేల్లో 10 వేల డ్రోన్లు తీసుకు వచ్చి వాటితో వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావాలని సీఎం సూచించగా, ముందస్తుగా 2 వేల డ్రోన్లు తీసుకువస్తున్నామని, డ్రోన్ టెక్నాలజీలో 222 రైతులకు శిక్షణ ఇచ్చి... పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామని అధికారులు వివరించారు. సాగులో శిక్షణ కార్యక్రమాలపై మరిన్ని వీడియోలు రూపొందించి ఆర్బీకే ఛానెల్ ద్వారా మరింతగా రైతులకు చేరువ చేయాలని, ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు, కంపెనీలు రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసేటప్పుడు కచ్చితంగా ఎంఎస్‌పీ ధరలు ఇవ్వాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. గడచిన నాలుగేళ్లలో వ్యవసాయ పంటల నుంచి 4.34 లక్షల ఎకరాల్లో ఉద్యానవన పంటల వైపు రైతులు మళ్లినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా, రెగ్యులర్ మార్కెట్‌కే కాకుండా ఫుడ్ ప్రాసెసింగ్‌కు అనుకూలమైన వంగడాలను ఉద్యానవన పంటల్లో ప్రోత్సహించాలని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా గోడౌన్లు, కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూమ్స్ నిర్మాణాన్ని పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు. పంటల సాగులో, బీమా కల్పనలో, ధాన్యం కొనుగోలులో రైతుభరోసా కేంద్రాలు ఇప్పటికే రైతులను చేయిపట్టుకుని నడిపిస్తున్నాయి. ధాన్యం సేకరణలో ఆర్బీకేల ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చేశాం. కనీస గిట్టుబాటు ధరలు రాని ఏ పంట కొనుగోళ్లలో అయినా ఆర్బీకే జోక్యం చేసుకుంటుంది. మిగిలిన పంటల కొనుగోలు కూడా ఆర్బీకే కేంద్రంగా జరిగేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఏపీ అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, వ్యవసాయ శాఖ సలహాదారు ఐ.తిరుపాల్ రెడ్డి, సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ సి.హరికిరణ్, హార్టికల్చర్ కమిషనర్ ఎస్.ఎస్.శ్రీధర్, ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్ పాండే, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ వీసీ అండ్ ఎండీ జి.శేఖర్‌బాబు, ఆర్థిక శాఖ కార్యదర్శి కె.వి.వి.సత్యనారాయణ, ఏపీడీడీసీఎఫ్ ఎండీ అహ్మద్ బాబు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మహిళలను కించపరిచే సంస్కృతికి స్వస్తి పలకాలి

విశాలాంధ్ర-విజయవాడ: సోషల్ మీడియా ద్వారా మహిళలను కించపరిచే సంస్కృతికి స్వస్తి పలకాలని రాష్ట్ర మహిళ కమిషన్ అధ్యక్షురాలు వాసిరెడ్డి పద్మ పిలుపునిచ్చారు. సోషల్ మీడియా ద్వారా మహిళలను కించపరిచే అంశంపై సమాజంలో చర్చ జరగాలనే ఉద్దేశంతోనే ప్రతి శుక్రవారం మహిళల ఆత్మ గౌరవ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. శుక్రవారం వెలగపూడి ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో మహిళల ఆత్మ గౌరవ దినోత్సవం (ఉమెన్స్ డిగ్నిటీ డే) ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సచివాలయ మహిళా ఉద్యోగినులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడంలో మహిళలు ఏమాత్రం వెనుకబడి లేరన్నారు. ఆటు కుటుంబాన్ని, ఇటు ఉద్యోగాన్ని ఎంతో చాకచక్యంతో సమన్వయం చేసుకుంటూ అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. అయితే మధ్యయుగాల నాటి మానసిక ధోరణి నుండి సమాజం బయటకి రాకపోవడం వల్ల మహిళలు వివిధ సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అనేక రంగాల్లో సమర్థంగా ముందుకు వెళుతూ భయం లేకుండా తమ అభిప్రాయాలను వెల్లడించే మహిళలను కించపరిచే విధంగా నీచంగా సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టే ధోరణి రోజురోజుకు పెరిగిపోతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. బయటి సమాజంలో చెల్లని బూతుమాటలు సోషల్ మీడియాలో ఎలా చెల్లుబాటు అవుతాయని ఆమె ప్రశ్నించారు. ఇంట్లో కూర్చోని చేతుల్లోనున్న ఫోను ద్వారా ఇష్టానుసారం మహిళలను కించపరిచే విధంగా పోస్టింగులు పెట్టే హక్కు ఎవరికీ లేదనే అంశంపై చర్చ జరగడం ద్వారా సమాజంలో తప్పక మార్పు వస్తుందని, మహిళలను కించపరిచే వారిని వేలు ఎత్తి చూపే పరిస్థితి తప్పక ఏర్పతుందనే ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళా సాధికారతకు, మహిళల ఆర్థిక స్వావలంబనకై రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను, కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆమె చెప్పారు. మహిళల ఆత్మగౌరవ దినోత్సవానికి రాష్ట్ర సచివాలయ మహిళా ఉద్యోగులు అంతా సంతకాలతో తమ మద్దతను తెలియజేశారు.

అసైన్డ్ భూములపై సాహసోపేత నిర్ణయం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అసైన్డ్ భూముల అంశంలో సీఎం జగన్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని, అసైన్డ్ భూముల లబ్ధిదారులైన పేదలకు సర్వహక్కులు కల్పించనున్నారని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు కొనియాడారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చాక తొలిసారి భూ హక్కుల సంస్కరణను జగన్ ప్రభుత్వం చేపట్టిందన్నారు. భూమి యాజమాన్యానికి సంబంధించి మార్పులు, సంస్కరణలు, ప్రయోజనకరమైన నిర్ణయాల్ని ఈ ప్రభుత్వం తీసుకొచ్చిందని, స్వాతంత్ర్యానికి పూర్వం ఇక్కడ ఎవరికీ వ్యవసాయ భూములు ఉండేవి కావని, ఆ తర్వాత అమల్లోకొచ్చిన చట్టాల ద్వారానే నిరుపేదలకు భూములొచ్చాయని వివరించారు. జగన్ ప్రభుత్వం వచ్చాక 20ఏళ్లుగా తమకిచ్చినటువంటి భూమిపై సాగుచేసుకుంటున్న వ్యక్తికి ఆ భూమిపై అన్నిరకాల హక్కుల్ని కల్పించిందని, ఇంతవరకు ఏ ప్రభుత్వం ఇలాంటి మహత్తర గొప్ప నిర్ణయం తీసుకోలేదని స్పష్టంచేశారు. 20 ఏళ్లపాటు అనుభవంలో ఉన్న అసైన్డ్ భూమిపైనున్న ఆంక్షలన్నీ ఎత్తేసి ఆ భూమిపై సర్వహక్కుల్ని లబ్ధిదారులకు కల్పించారన్నారు. ఒక ప్రైవేటు భూమిపై వ్యక్తులకున్న హక్కులన్నీ, నేటికి 20 ఏళ్లుగా సాగుచేసుకుంటున్న అసైన్డ్‌భూమి రైతులకు కూడా ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేస్తోందన్నారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలో సుమారు 15.21లక్షల మంది అసైన్డ్ రైతులు లబ్ధిపొందుతున్నారు. భూ రీసర్వే ద్వారా ఇప్పటికే 19 లక్షల మ్యుటేషన్లు జరిగాయని వివరించారు. 2.06 లక్షల ఎకరాల చుక్కల భూముల సమస్య తీర్చామన్నారు.

నాడు-నేడుకు అంతర్జాతీయ గుర్తింపు

విశాలాంధ్ర-విజయవాడ: పేదరిక నిర్మూలన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకొచ్చిన సంక్షేమ పథకాల్లో నాడు- నేడు అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం వేదికగా జరుగుతున్న అత్యున్నతస్థాయి రాజకీయ వేదికలో ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న సంక్షేమ పథకాల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఐక్యరాజ్యసమితి స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకీన్ కుమార్ మాట్లాడుతూ జులై 10న మొదటి రోజు లింగ సమానత్వంపై చర్చ జరిగిందన్నారు. అత్యున్నతస్థాయి రాజకీయ వేదికలో ప్రపంచంలోని 140 దేశాల ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు. సుస్థిర అభివృద్ధిలో ఉన్నతవిద్య పాత్రపై చర్చించారని, విద్యకు సంబం ధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడినట్లు చెప్పారు. విద్యలో లింగ అసమానతలు తొలగించడానికి, సమానత్వం కోసం చేపట్టిన నాడు-నేడు ప్రభావవంతమైన విధానమని షకీన్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు శానిటరీ నాప్కిన్లు అందించడాన్ని ప్రశంసించారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న విద్యా బోధన, అభ్యాసం ద్వారా బాలికలను అభివృద్ధి చేయడం కోసం నిర్వహిస్తున్న నాడు-నేడు విద్యా కార్యక్రమాలను సదస్సులో ముఖ్యంగా ప్రశంసించారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాడు నేడు ద్వారా బాలికలకు ప్రత్యేక స్థానం కల్పించ డంపై వివిధ దేశాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేసినట్లు చెప్పారు. ఆడపిల్లలు విభిన్న రంగాలలో రాణించాలన్నదే ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ముఖ్య ఉద్దేశమని షకీన్ కుమార్ తెలిపారు. ఐక్యరాజ్యసమితి కార్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన నాడు నేడు స్టాల్ ప్రతినిధులను విశేషంగా ఆకర్షించింది. బాలికల విద్య కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రయోజనాల వివరాలను ఫ్లకార్డులు, ఇమేజ్ బోర్డులు, రోలర్ బ్యానర్ల రూపాలలో ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను వివిధ సంస్థల ప్రతినిధులు సందర్శి ంచారు. వివిధ దేశాల ప్రతినిధులు, ఐక్యరాజ్యసమితి సభ్యులు, విద్యావేత్తలు, ప్రభుత్వ రంగ అధికారులు సందర్శించిన నాడు నేడు పథకం కింద చేపడుతున్న సంస్కరణలను అడిగి తెలుసుకొని అభినందించినట్లు షకీన్ కుమార్ వివరించారు.

23న ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల చలో విజయవాడ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 23వ తేదీన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు చలో విజయవాడకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏపీ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయీస్, టీచర్స్, ఆఫీసర్స్ జేఏసీ ని ఎన్నుకున్నట్టు రాష్ట్ర గౌరవాధ్యక్షులు పట్టపు శీనయ్య, కన్వీనర్ ఎన్.జగదీశ్, రాష్ట్ర నాయకులు బేతాల సుదర్శన్, మేడికొండ ప్రసాద్, శ్రీను బాబు, అశోక్, వెంకట్రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులు,ఉపాధ్యాయులు, అధికారులతో జేఏసీగా ఏర్పడినట్లు తెలిపారు. 23న అంబేద్కర్ భవన్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈ సభ అనంతరం ప్రతి జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు, ఆ తర్వాత లక్ష మందితో చలో సెక్రటేరియట్ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమాలకు లక్షలాదిగా ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులు, టీచర్లు, అధికారులు తరలివచ్చి విజయవంతం చేయాలని జేఏసీ నేతలు కోరారు.



ఉపాధ్యాయుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర-విజయవాడ: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహార్ రెడ్డికి ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయిశ్రీనివాస్, తిమ్మన్న విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వెలగపూడి సచివాలయంలోని ఒకటవ బ్లాకులో జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉపాధ్యాయ సమస్యలపై వినతులు సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు లక్షల మంది ఉపాధ్యాయులు ఉన్నారని, వారి పెండింగ్ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మోడల్ స్కూల్ టీచర్‌లకు 010 హెడ్ జీతాలు, పదోన్నతులు, బదిలీలపై చర్యలు తీసుకోవాలన్నారు. కస్తూర్బా ఉపాధ్యాయులకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. సీపీఎస్ రద్దు ఉద్యమప్పుడు నమోదైన కేసులను ఎత్తివేయాలన్నారు. 2003 డీఎస్సీ వారికి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్ ఉన్న సంపాదిత సెలవు నగదీకరణ బిల్లులన్నీ చెల్లించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరులోగా బిల్లుల చెల్లింపు పూర్తి అవుతుందని ఆర్థిక శాఖ కార్యదర్శి సత్యనారాయణ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. 12వ వేతన సవరణ సంఘం వేయడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. 50 శాతం మధ్యంతర భృతి ప్రకటించి ఎన్నికలలోపే పీఆర్సీ అమలు చేయాలని కూడా వారు డిమాండ్ చేశారు. కోవిడ్ వల్ల చనిపోయిన ఉపాధ్యాయుల కుటుంబీకుల కారుణ్య నియమకాలు 1149 పెండింగ్‌లో ఉన్నాయని, సంబంధించిన ఫైలు సీఎం వద్ద ఉందని గుర్తుచేశారు. దీనిని త్వరగా ఆమోదించాలని కోరారు. ఒప్పంద సిబ్బందిని క్రమబద్ధీకరించే ఫైలు పరిశీలన వేగవంతం చేయాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని వారు కోరారు. టైపిస్ట్, డేటా ఆపరేటర్ పోస్టులను కంప్యూటర్ బేస్డ్ విధంగా సింగిల్ కేడర్‌గా మార్చాలన్నారు. 679 ఎంఈఓ2 పోస్టులను కొత్తగా మంజూరు చేసినప్పటికీ విధులను సమానంగా విభజించాలని సూచించారు. పురపాలక ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌ను ఆమోదించాలని కోరారు. లాంగ్వేజ్ పండిట్2 పోస్టులను అప్‌గ్రేడ్ చేయటానికి సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించాలన్నారు. ఏపీఎస్‌కు మాత్రమే ఎస్టీయూ ఒప్పుకుందన్నారు. సీపీఎస్/జీపీఎస్‌కు తాము వ్యతిరేకమని తెలిపారు. దివ్యాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించే ఫైలును కేబినెట్ ఆమోదించాలని ఎస్టీయూ నేతలు కోరారు.

వక్ఫ్ బోర్డు ఎన్నికలకు రంగం సిద్ధం

- ఇప్పటికే ఎంపీ, ఎమ్మెల్యే కోటా డైరెక్టర్ పదవులకు దరఖాస్తుల ఆహ్వానం
- ముతావల్లీ కోటా డైరెక్టర్ల ఎన్నికలకు కసరత్తు
- రెండు రోజుల్లో షెడ్యూల్ విడుదల
- నేడు విజయవాడలో రాష్ట్రస్థాయి ముతావల్లీల సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఎన్నికల ప్రక్రియపై మైనారిటీ శాఖ, వక్ఫ్ బోర్డు అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్ వక్ఫ్ బోర్డులో తొమ్మిది మంది డైరెక్టర్లు ఉంటారు. వీరిలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకుంటారు. తొమ్మిది మంది డైరెక్టర్లలో ఎంపీ, ఎమ్మెల్యే కోటాలో ఇద్దరు మైనారిటీ సభ్యులు ఉంటారు. ఒక ఐఏఎస్ లేదా ఐపీఎస్‌ను డైరెక్టర్‌గా నియమిస్తారు. మరో ఇద్దరిని రాష్ట్రంలోని ముతావల్లిలు ఎన్నికల ద్వారా ఎన్నుకుంటారు. న్యాయవాదుల కోటాలో ఒకరిని, ఒక సంఘ సేవకుడిని, సున్ని, షియా వర్గాల నుంచి ఒక్కొక్కరినీ నామినేట్ చేస్తారు. వక్ఫ్ బోర్డు గత పాలక మండలి పదవీకాలం ఈ ఏడాది మార్చిలో ముగిసింది. దీంతో నూతన పాలకమండలి నియామకం కోసం చర్యలు చేపట్టారు.

ముమ్మర కసరత్తు

ఇప్పటికే ఎంపీ, ఎమ్మెల్యే కోటా డైరెక్టర్ పదవుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానించారు. ఇక ముతావల్లి కోటా డైరెక్టర్ పదవుల కోసం ఎన్నికల నిర్వహణకు అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఈ ఎన్నికలకు సోమవారం లేదా మంగళవారం షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్లతో శుక్రవారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయంలో ప్రత్యేకాధికారి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని ముతావల్లిల వివరాలు, ఓటు హక్కు కలిగినవారి గురించి ఆరా తీసినట్లు తెలిసింది.

నామినేటెడ్ డైరెక్టర్ పదవులకు సిఫార్సులు

మరోవైపు మూడు నామినేటెడ్ డైరెక్టర్ పదవులకు ప్రభుత్వ పెద్దలు ఇప్పటికే సిఫార్సు లేఖలు ఇచ్చినట్లు సమాచారం. గత పాలకమండలిలో డైరెక్టర్‌గా ఉన్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఒకరిని మళ్లీ కొనసాగించే విధంగా ప్రభుత్వంలో కీలకమైన వ్యక్తి లేఖ ఇచ్చినట్లు తెలిసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మరొకరికి కూడా ఒక నేత సిఫార్సు లేఖ ఇచ్చినట్లు సమాచారం. ఇదే తరహాలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మరో వ్యక్తి కూడా సిఫార్సు లేఖను పొందినట్లు తెలిసింది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి వీరి ముగ్గురిని నామినేట్ చేస్తున్నట్లు వెల్లడించే అవకాశం ఉందని సమాచారం.

నేడు ముతావల్లిల సమావేశం

వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎన్నికలకు కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని ముతావల్లిలు అందరూ శనివారం విజయ వాడలోని బెరంపార్క్‌లో సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి అన్ని జిల్లాల నుంచి ముతా వల్లిలు హాజరుకానున్నట్లు తెలిసింది.

పది లక్షల కియా కార్ల ఉత్పత్తి

చంద్రబాబు హర్షం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అనంతపురంలోని కియా ఫ్యాక్టరీ పది లక్షల కార్ల ఉత్పత్తి మైలురాయిని చేరుకోవడం ఆనందంగా ఉందని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అన్నారు. కియా యాజమాన్యానికి ఆయన అభినందనలు తెలిపారు. 2017లో ఆంధ్రప్రదేశ్‌లో కియా పెట్టుబడులు ఓ బలమైన సంకల్పమన్న చంద్రబాబు...ఈ సమర్థ విధానం ఆ ప్రాంత రూపురేఖల్ని మార్చి సంపద సృష్టి, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా తీర్చిదిద్దిందని చెప్పారు. ప్రపంచ వేదికపై ఇది ఓ ప్రత్యేకతను చాటుకుందన్నారు. దీంతో రాయలసీమ ప్రాంతానికి ప్రయోజనం కలిగినందుకు సంతోషిస్తున్నానని చెప్పారు. వేలాదిమంది స్థానికులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే ఉపాధి పొందుతున్నారని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు.

ఏపీ ఎడ్‌సెట్ ఫలితాల విడుదల

విశాలాంధ్ర-విశాఖ సిటీ: ఆంధ్రప్రదేశ్‌లో బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఏపీ ఎడ్‌సెట్ చైర్మన్, ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద్ రెడ్డి శుక్రవారం ఫలితాలను విడుదల చేసారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 11,236 మంది పరీక్ష రాస్తే 10,908 మంది ఉత్తీర్ణత సాధించారని రెడ్డి అన్నారు. 97.08 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. గణితంలో 99.63 శాతం, భౌతిక శాస్త్రంలో 98.66శాతం, జీవశాస్త్రంలో 95.41శాతం, సాంఘిక శాస్త్రంలో 95.59 శాతం, ఆంగ్లంలో 99.58 శాతం మంది చొప్పున ఉత్తీర్ణత సాధించారన్నారు. గణితంలో వై.సాగర్, భౌతిక శాస్త్రంలో ఎం.తిరుపతి నాయుడు, జీవశాస్త్రంలో ఎల్.అస్మా, సాంఘిక శాస్త్రంలో ఎస్.బలరాం నాయుడు, ఆంగ్లంలో బి.నవీన్ మొదటి ర్యాంకులు సాధించారని ప్రసాద్ రెడ్డి తెలిపారు. సమావేశంలో ఏపీ ఎడ్‌సెట్ - 2023 కన్వీనర్ ఆచార్య కె.రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ఏపీ పీజీసెట్‌లో 85శాతం ఉత్తీర్ణత

రాష్ట్రవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ పీజీసెట్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి విడుదల చేశారు. పరీక్షకు 6,799 మంది హాజరు కాగా, 22,858 మంది అర్హత సాధించారని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 37 కేంద్రాలలో పరీక్ష నిర్వహించామని, 85.29 శాతం మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. బాలురు 85.24 శాతం మంది, బాలికలు 85.33 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. మొత్తం 21 సబ్జెక్టుల్లో పరీక్షలను నిర్వహించినట్లు వెల్లడించారు.

ర్యాంకర్లు వీరే....: ఆంగ్లంలో డి.సుధాకర రావు, తెలుగులో కె.నవ్య, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్లో వై.రిషిత, చరిత్రలో జి.భార్గవి, రాజకీయ శాస్త్రంలో ఎం. రాహుల్, ఆర్థిక శాస్త్రంలో బి.ప్రసాద్, కామర్స్ జె.సూర్య సాయి చరణ్, ఎడ్యుకేషన్ లో బి. రామకృష్ణ, లైఫ్ సైన్స్‌లో పి.రేణుక, ఫుడ్ అండ్ న్యూట్రిషనల్ సైన్స్‌లో కె.వైష్ణవి, బాటనీలో వి.వరుణ్, సెరీకల్చర్‌లో జి.వెన్నెల, జంతుశాస్త్రంలో పీఆర్ గాయత్రి, గణితంలో వై.సాగర్, స్టాటస్టిక్స్‌లో టి.ప్రద్యున్, భౌతికశాస్త్రంలో షేక్ రోషన్, ఎలక్ట్రానిక్స్‌లో ఎస్.బాలమణి, రసాయన శాస్త్రంలో టి. రాజ శేఖర్, జియాలజీలో డి.జ్యోష్ణవి, సైకాలజీలో పి.లక్ష్మి సౌజన్య, కంప్యూటర్ సైన్స్‌లో టి. సురేశ్ కుమార్ మెదటి ర్యాంకు సాధించారు.

సంస్కృతం లేనిదే సంస్కృతి లేదు

గవర్నర్ అబ్దుల్ నజీర్

విశాలాంధ్ర-తిరుపతి: సంస్కృతం ప్రపంచంలోని పురాతన భాషలలో ఒకటిగా ఉన్న విషయం తెలిసిందేనని, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, మైసూర్‌లోని సంస్కృతి ఫౌండేషన్‌ల సహకారంతో జాతీయ సంస్కృత సదస్సును నిర్వహించేందుకు ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని వేదికగా ఎంచుకున్నందుకు సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సాహిత్య అకాడమీ వారికి అభినందనలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చేరుకున్న గవర్నర్ నజీర్‌కు ఘన స్వాగతం లభించింది. చెలికాని అన్నారావు భవన్ లో ఏర్పాటు చేసిన విజ్ఞాన , పుస్తక , వస్తు ప్రదర్శిని, పాండు లిపి, తాళపత్ర గ్రంథాల ప్రదర్శనలను గవర్నర్ తిలకించారు. అనంతరం జాతీయ సంస్కృత సదస్సు ముగింపు సందర్భగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జాతీయ సంస్కృత సమ్మేళనం నిర్వహించి ,సంస్కృతాన్ని అట్టడుగు స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం జరగడం సంతోషంగా ఉందన్నారు. ఈ మూడు రోజుల సదస్సులో పాల్గొన్న ప్రముఖ సంస్కృత పండితులు, రచయితలు, కవులు, పరిశోధకులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నానన్నారు. భారత రాజ్యాంగంలో 22 అధికారిక భాషలలో ఒకటిగా ఉన్న సంస్కృతం... హిందీ, కన్నడ, మలయాళం వంటి ఇతర భారతీయ భాషలపై ప్రధాన ప్రభావాన్ని చూపిందన్నారు. నేటికీ కర్ణాటక, మధ్యప్రదేశ్‌లోని ఐదు గ్రామాలకు సంస్కృతం ప్రథమ భాష గా ఉందని తెలిపారు. చైనా, థాయ్‌లాండ్, శ్రీలంక, ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్‌లో మాట్లాడే భాషలు సంస్కృతం ద్వారా విపరీతంగా ప్రభావితమయ్యాయని గవర్నర్ చెప్పారు. భారతదేశం 5000 మాట్లాడే భాషల భాండాగారాన్ని కలిగి ఉన్నప్పటికీ సంస్కృతం మాత్రమే పవిత్ర భాషగా పరిగణించబడుతోందన్నారు. భారతదేశంలోని వందలాది విద్యాసంస్థల్లో సంస్కృతం ఒక సబ్జెక్ట్‌గా కొనసాగుతోందని గుర్తుచేశారు. ' జాతీయ సంస్కృత మహాసభను విజయవంతంగా నిర్వహించి నందుకు సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సాహిత్య అకాడమీ, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, సంస్కృతి ఫౌండేషన్‌ని నేను అభినందిస్తున్నా... సంస్కృత సాహిత్యం, భాష గొప్పతనంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వారి భవిష్యత్ ప్రయత్నాలలో విజయం సాధించాలని కోరుకుంటున్నా ... సంస్కృతం లేనిదే సంస్కృతి లేదని నమ్ముతూ హాజరైన ప్రముఖులకు మరొక్కసారి ధన్యవాదాలు' అని గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ సందర్భంగా గవర్నర్ నజీర్‌ను నిర్వాహకులు ఘనంగా సన్మానించి, శ్రీవారి చిత్ర పటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కె. శ్రీనివాసరావు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఆర్. కృష్ణ మూర్తి, వేదిక్ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ రాణి సదాశివ మూర్తి, మాజీ వైస్‌ఛాన్స్‌లర్ హరే కృష్ణ శతపతి, మహిళా యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ భారతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. గవర్నర్ పర్యటన సందర్భంగా ఎస్పీ పరమేశ్వర రెడ్డి, అడిషనల్ ఎస్పీలు కులశేఖర్, విమల కుమారి, డీఎస్పీలు నరసప్ప, నందకిషోర్ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చంద్రబాబుకు కాపులను అమ్మడానికే...

పవన్ యాత్రపై మంత్రి అంబటి రాంబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాపులను మచ్చిక చేసుకుని చంద్రబాబుకు అమ్మడానికే పవన్ కల్యాణ్ వారాహి యాత్ర చేస్తున్నారని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు తీవ్రంగా విమర్శించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంబటి మాట్లాడుతూ పవన్‌తో రాజకీయంగానే కాకుండా వ్యక్తిగతంగానూ ఎవరూ నడవలేరన్నారు. అందుకే రాజకీయాలకు పవన్ పనికిరారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌ను పవన్ ఏకవచనంతో పిలిస్తే ఏంటి..? బహువచనంతో పిలిస్తే ఏమిటని వ్యాఖ్యానిం చారు. పవన్ అసెంబ్లీకి వెళ్లలేరని, దత్తతండ్రిని సీఎంగా చేయలేరని నొక్కిచెప్పారు. ప్రజల ముందు చెప్పులు చూపించడమే పవన్ సంస్కారమా అని నిలదీశారు. వలంటీర్ వ్యవస్థపై అభ్యంతరం ఏమిటని పవన్‌ను ప్రశ్నిస్తూ... మైకు పట్టుకొని ఊగితే విప్లవ కారులు కాలేరని హితవు పలికారు. పవన్‌ది వారాహి యాత్ర కాదని, ఆయన వరాహి యాత్ర చేస్తున్నారని అంబటి మండిపడ్డారు.

సంపాదకీయం

తిరగబడ్డ యమునా నది

గత వారం అంతా ఉత్తరాదిలో అపూర్వమైన రీతిలో అధిక వర్షపాతంవల్ల ఢిల్లీ నగరంలో జనజీవనానికి విఘాతం కలిగింది. ఈ విపత్తు ఒక్క ఢిల్లీకే పరిమితం కాలేదు. హర్యానా, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, కొంతమేర ఉత్తర ప్రదేశ్ కూడా కుంభ వృష్టి బారిన పడ్డాయి. ఢిల్లీలో అయితే ఇంత భారీవర్షం కురవడం నలభై ఏళ్ల తరవాత ఇప్పుడే అంటున్నారు. చండీగఢ్‌లో అయితే ఎనిమిది, తొమ్మిది తేదీల్లో 302 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఇంతటి వర్షపాతం ఇదివరకు చూసిన వారే లేరంటున్నారు. ఈ వర్ష బీభత్స ప్రభావం పొరుగున ఉన్న పాకిస్తాన్‌లోనూ కనిపించింది. అక్కడి చీనాబ్, సట్లేజ్, రావి నదుల్లో నీటిమట్టం అమాంతం పెరిగింది. అక్కడా కొన్ని ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించవలసి వచ్చింది. ఈ వర్ష బీభత్సంవల్ల ఢిల్లీతో కలిపితే ఎనిమిది రాష్ట్రాలలో కనీసం 50 మంది ప్రాణాలు కోల్పోయారు. ఢిల్లీలోని ఘరానా వీధులతో పాటు నగరమంతా జలమయమైంది. రాజ్‌ఘాట్, ఐ.టి.ఒ.సర్కిల్, సుప్రీంకోర్టు పరిసర ప్రాంతాలూ నీటితో నిండిపోయాయి. రాకపోకలు దాదాపు స్తంభించినంత పనైంది. అందువల్ల అత్యవసర సేవలు అందించవలసిన విభాగాలు తప్ప మిగతా కార్యాలయాలన్నీ మూసివేయవలసి వచ్చింది. కొన్ని సంస్థలు తమ సిబ్బందిని ఇంటిదగ్గర్నుంచే పని చేయమని ఆదేశించాయి. ఇంటిదగ్గర్నుంచే పనిచేసే ప్రయోగానికి కరోనా శ్రీకారం చుట్టింది. మామూలుగా అయితే దేశ రాజధాని ఢిల్లీలో యమునా నది అక్కడక్కడ చిన్న పాయలుగానో, కొన్ని చోట్ల ఇసక పర్రల్లాగానో కనిపిస్తుంది. కానీ వర్ష తీవ్రతవల్ల దాదాపు గత వారం రోజులనుంచి మహోగ్ర రూపం దాల్చింది. యమునానది ప్రమాద సూచిక 205.33 మీటర్లైతే అది 208.66 మీటర్లకు చేరింది. శుక్రవారం నాటికి యమునా నదిలో వరద ఉధృతి తగ్గినా ఢిల్లీలోని పల్లపు ప్రాంతాలు ఇంకా చెరువులను తలపిస్తున్నాయి. హతినీకుండ్ బ్యారేజీ దగ్గర హర్యానా నీరు విడుదల చేయడం కూడా యమునలో నీటిమట్టం పెరగడానికి కారణమైంది. ఇంద్రప్రస్థ దగ్గర ఢిల్లీ నీటిపారుదల, వరద నియంత్రణ వ్యవస్థ పాడైపోవడంవల్ల మధ్య ఢిల్లీలోని సుప్రీంకోర్టు పరిసరాలు కూడా నీట మునిగాయి. అయితే ఈ వ్యవస్థను సత్వరం బాగు చేయడం మెచ్చుకోదగిన చర్యే. గోవులనే కాదు నదులనూ పూజించే దేశం మనది. కానీ నదులను మనం దుర్వినియోగం చేసినట్టుగా మరెక్కడా చేయరేమో! పట్టణీకరణ అత్యంత వేగవంతంగా పెరుగుతూ ఉండడం, జనాభా విస్ఫోటనం కారణంగా ప్రకృతి వనరులను అతిగా వినియోగించు కోవడంవల్ల అప్పుడప్పుడూ ప్రకృతి శక్తులు విజృంభించి జనజీవనాన్ని దుర్భరం చేస్తున్నాయి. ప్రకృతి నియమాలను, క్రమాన్ని అతిగా దుర్వినియోగం చేసినందువల్ల ఈ విపత్తులు అనివార్యమే అవుతాయి. పట్టణాల మీద జనభారం ఎంతగా పెరిగిపోతోందంటే ఉన్న మౌలిక వనరులు పెరిగే జనాభా వనరులను తీర్చడానికి సరిపోయేంతగా లేవు. ప్రకృతి ప్రకోపించినప్పుడు ఈ వ్యవస్థలూ కుదేలైపోతాయి. నగరాల్లో వరద నియంత్రణా వ్యవస్థలు నామ మాత్రమే. వర్షం కురిసినప్పుడల్లా నగర జీవితం నరకప్రాయం అవుతోంది. వీధులు నదులుగా మారుతుంటాయి. ఇళ్లు చిన్న చిన్న దీవులుగా కనిపిస్తాయి. రోజువారీ జీవితం స్తంభిస్తుంది. ఢిల్లీ, గూర్గాం, ముంబైలాంటి నగరాల్లో ఈ కష్టాలు పునరావృతం అవుతూనే ఉన్నాయి.

ప్రకృతి వైపరీత్యాలు మానవ జీవితాలను అల్లకల్లోలం చేసిన సందర్భాలు ఎన్నైనా కనిపిస్తాయి. తన అవసరాలకోసం, మనుగడ కోసం, పురోభివృద్ధికోసం, నాగరికతాభివృద్ధికోసం మనిషి ప్రకృతిని తనకు అనువుగా మలుచుకునే క్రమంలో ప్రకృతిని లొంగదీయాలనుకుంటాడు. ఈ క్రమంలో ప్రకృతి విధ్వంసం జరిగిపోతుంది. ఈ విధ్వంసం కడకు మనిషి అస్తిత్వానికే ముప్పు కలిగించవచ్చు. మన నగరాల్లో వరదలు రావడానికి అనేక కారణాలున్నాయి. అవి పొరుగున ఉన్న నదుల్లో, బ్యారేజీల్లో, జలాశయాల్లో జలప్రవాహం పెరగడమూ కావచ్చు. లేదా వివిధ వ్యవస్థలు, మౌలిక సదుపాయాలు సవ్యంగా పనిచేయకనూ పోవచ్చు. నగరాలకు ఎగువన భారీవర్షాలు కురిస్తే దిగువన ఉన్న నగరాలు విపత్తులో పడిపోతాయి. వాన నీటికోసం కొన్ని నగరాల్లో ఇదివరకు నిర్మించిన వ్యవస్థలు ఇప్పుడు ఆనవాలు లేకుండా పోయాయి. అవన్నీ దురాక్రమణలకు గురైనాయి. మన నగరాల విస్తరణకు నియతమైన నియమాలు ఉన్నట్టు కనిపించదు. సహజమైన నీటిప్రవాహ మార్గాలను ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించినందువల్ల ఆ నీటి ప్రవాహం దారిమళ్లి మరోచోట ప్రమాదానికి దారితీయక తప్పదు. ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరులో పట్టణీకరణ, ఆర్థికాభివృద్ధి వల్ల ప్రయోజనాలు ఉంటే ఉండవచ్చు. కానీ ప్రకృతి విలయ తాండవం చేసినప్పుడు ఈ నగరాలన్నీ అల్లాడిపోయేవే. సహాయక చర్యలు చేపట్టే బృందాలు వీధుల్లో పడవల మీద వెళ్లడం చూస్తూనే ఉన్నాం. భవన నిర్మాణాలు శ్రుతి మించినందువల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకే మార్గాలన్నీ మూసుకుపోయాయి. దీనివల్ల రోడ్లమీద నిలవ ఉండిపోతాయి.

చట్ట వ్యతిరేక నిర్మాణాలను అరికట్టడం, సహజంగా నీటిపారుదలకు మునుపు ఉన్న మార్గాలకు అవాంతరాలు తొలగించడం, భూ వినియోగ పద్ధతిలో మార్పులు తీసుకురావడం, పట్టణాలకు వలసలను తగ్గించడానికి గ్రామీణ ప్రాంతాలలో సదుపాయాలు, ఉపాధి అవకాశాలు పెంచడానికి తగిన ఏర్పాట్లు చేయడంవల్ల ఈ విపత్తులను నివారించవచ్చు. ఇవన్నీ చేయాలంటే దృఢమైన రాజకీయ సంకల్ప బలంకావాలి. కొరతల్లా దానిదే. భౌగోళిక పరిస్థితులకు అనువుగా నగరాలను దిద్ది తీర్చడం మీద శ్రద్ధేలేదు. మురుగునీటి పారుదల వ్యవస్థ చాలాచోట్ల ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. వ్యర్థపదార్థాలను ఏం చేయాలో తెలియని పరిస్థితి. మడ అడవులు నిత్యం ధ్వంసం అయిపోతున్నాయి. సముద్ర తీర ప్రాంతాలలో వెలసిన నగరాలకు ప్రకృతి విపత్తులు మరీ ఎక్కువ. ఆ నగరాల్లో వరదలు ఏ రూపంలో వచ్చినా ఎదుర్కోవడం కష్టమే. ఇలాంటి వరదలవల్ల జనం, ముఖ్యంగా పేదలు నిర్వాసితులు కావడం, మౌలిక సదుపాయాలు ధ్వంసం అయిపోవడం, ఆర్థిక నష్టాలు, రవాణా సమస్యలు విపత్తుల ముప్పును మరింతగా పెంచుతాయి. నదీ జలాలకు చోటులేకుండా చేసినప్పుడు ఆ నీరు పొంగి పొర్లుతుంది. అక్కడా ఇళ్లు కట్టేసినందువల్ల నదులు తమ ప్రవాహ ఉధృతిలో వాటినీ కబళిస్తాయి. ఇది ఇటీవల ఎదురవుతున్న ప్రమాదంకాదు. ఒక్క ఢిల్లీ ఉదాహరణే తీసుకుంటే 17వ శతాబ్దంలోనే యమునా నది ఒడ్డుననే ఎర్రకోట నిర్మించారు. బ్రిటిష్ వారు ఆ తరవాత సివిల్ లైన్స్ ఏర్పాటుచేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత యమునా నది ప్రవహించే ప్రాంతాన్ని బలాదూరుగా కుంచింపచేశాం. యమునా బాంక్ మెట్రో స్టేషన్, అక్షర ధాం, కామన్వెల్త్ గ్రామం లాంటివన్నీ యమునా నది సహజ ప్రవాహ దిశను అడ్డుకున్నవే. అక్రమ నిర్మాణాలకు లెక్కే లేదు. యమునా నది ప్రవాహ ప్రాంతం ఇదివరకు 5 నుంచి 10 కి.మీ. మేర ఉండేది. ఇప్పుడది కొన్ని చోట్ల కొన్ని మీటర్లకే పరిమితమైంది. నది ప్రవాహ మార్గాన్ని అడ్డుకుంటే అదీ బాహువులు చాచి ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంపిక చేసుకుంటుందిగా!

ఇక ప్రపంచ ప్రజాకవి వీవీ

"అమరుడయ్యాడను...
ఆకాశ తార అవుతాడను...
ఒక మనిషి మరణించడమంటే
మానవత్వం ఊపిరి బిగపట్టడమే"

ఇవి వీవీగా సాహిత్యలోకం పిలుచుకునే వరవరరావు కవిత్వ పంక్తులు. ఎవరైనా మరణించారని నాకు తెలిసిన వెంటనే గుర్తుకొచ్చే కవిత్వ పంక్తులు ఇవి. "రహస్యం ఏమిటంటే...నా కవిత్వం ఉద్యమం ఉగ్గుపాలతో ఊపిరి పోసుకున్నది" ఇదీ వీవీ రాసిందే మరో కవితలో...

వరవరరావు సిద్ధాంతాలు...దాని మీద జరుగుతున్న రాద్ధాంతాలు

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

పక్కనపెడితే కవిగా వరవరరావు తెలుగుసాహిత్యంపై బలమైన ముద్రవేసిన కవి. బహుశా ఆయన వ్యక్తిత్వం కూడా ఇందులో భాగస్వామే. బాగ్‌లింగ పల్లిలో ఎంఐజీ క్వార్టర్స్‌లో వరవరరావు నివాసంఉన్నప్పుడు తొలిసారిగా కలిసా. అంటే దాదాపు మూడు దశాబ్దాల క్రితం నా యవ్వన కాలంలో. ఆ తొలి రోజు నన్ను నేను పరిచయం చేసుకుని "మీ కవిత్వం అంటే ఇష్టం" అన్నాను. చిన్న చిరునవ్వు. అంతే. ఏ ఊరు అని అడిగారు. అమలాపురం అని చెప్పగానే మా ఊరినుంచి వచ్చి అప్పుడే కవిగా స్థిరపడు తున్న వసీరా తెలుసా అని అడిగారు వరవరరావు. "మా ఊరే. మా ఇంటి పక్కనే. వాడే మీ కవిత్వం చదవమన్నాడు" అన్నాను. మళ్లీ చిరునవ్వే. "ఏం చేస్తున్నారు. ఎక్కడఉన్నారు" మళ్లీ వీవీనే. "ఉద్యోగంకోసం వచ్చాను. రాంనగర్‌లో మిత్రుడి రూంలో ఉన్నాను" నా సమాధానం. వీవీది మళ్లీ అదే చిరునవ్వు.

జర్నలిస్టుగా ఉద్యోగంలో చేరిన తర్వాత అనేక కవి సమయాల్లో, ప్రెస్ కాన్ఫరెన్సుల్లో కలిసే వాడిని. అదే చిరునవ్వుతో పలకరింపు. కాకపోతే చిన్న తేడా. "చక్రి ఎలా ఉన్నావు అనే పలకరింపు" కూడా తోడయ్యింది ఆ చిరునవ్వుకు. ఇన్నాళ్ల ప్రయాణంలో ఆ చిరునవ్వును అలా కాపాడుకున్న కవి బహుశా తెలుగు సాహిత్యంలో వరవరరావు ఒక్కరేనేమో.

వరవరరావు రాసిన కవిత్వమంతా 'వరవరరావు ఎ లైఫ్ ఇన్ పొయిట్రీ' పేరుతో ఇంగ్లీషులో అనువాదం అయ్యింది. ఇది వీవీ మేనల్లుడు ఎన్.వేణు గోపాల్ మూడుదశాబ్దాలుగా కన్న కల అనిచెప్పాడు. ఈ ఇంగ్లీషు అనువాద సంకలనం నాకు ఇంకా చేరలేదు. కాని తెలుగులో మాత్రం దాదాపు ఈ కవిత్వమంతా చదివే ఉంటాను నేను. ఈ మాట ఎందుకంటే... వరవర రావు కవిత్వం చదివి కన్నీరు కార్చని వారు ఉండరని నా నమ్మకం. ఇంగ్లీషు భావకవులు చెప్పిన వెన్నెల, ప్రకృతి, ఊర్వశి, పువ్వులు తెలుగు భావ కవిత్వం నిండా ఉన్నాయి. ఇలాంటి కవిత్వం బహుశా ఇంగ్లీషు పాఠకులకి అంతగా అవసరం లేదని నా వ్యక్తిగత అభిప్రాయం. కాని తెలుగు వారి జీవితం, పేదరికం, దోపిడీ, ఆకలి, అస్తిత్వ పోరాటాలు ఆ పాఠకులకు ఎలా తెలుస్తాయి. ఇక్కడి నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసమో...మరో ఉద్యోగాల కోసమో వివిధ దేశాల్లో ఉన్న తెలుగు వారి జీవితాలే ఇంగ్లీషు పాఠకులకు పరిచయం. మరి మా బతుకులు ఇదిగో ఇలా ఉన్నాయి అని తెలియాలంటే వరవరరావు వంటి వారు రాసిన కవిత్వం ఇంగ్లీషులోకి వెళ్లాల్సిందే కదా. మనం కూడా అక్కడి జీవితాలను ఇలాగే కదా తెలుసుకున్నది. "ఈగ నవ్వుతోంది... ముందు నుంచా...వెనుక నుంచా" అని రాసి దానికి కవిత్వం అని పేరు పెడుతున్న మాయదారి రోజుల్లో ఉన్నాం మనం. ఈ సమయంలో ఇదీ మన కవిత్వం అని వరవరరావు కవిత్వాన్ని ఇతర భాషల కవిత్వాభిమానులకు తెలియచేయాలి కదా. అందుకే వీవీ ఇంగ్లీషు కవిత్వ సంకలాన్ని సాహిత్యాభిమానులంతా స్వాగతించాలి. ఈ ఇంగ్లీషు అనువాదంలో సీ.వి.సుబ్బారావు, కే.బాల గోపాల్ చేసిన అనువాదాలున్నాయి. వారిద్దరి గురించి ప్రత్యేకంగా చెప్పుకో వాల్సింది ఉండదు. ఇద్దరూ వారి వారి కాలాల్లో అద్భుతమైన మనుషులు. నిరంతరం ప్రజల కోసం ఆలోచించిన వారు. వారిద్దరి అనువాదాలు ఆ స్థాయిలోనే ఉంటాయి. ఇక మిగిలిన వాటిలో ఎక్కువ కవితలు ఎన్. వేణుగోపాల్ అనువదించినవే. వరవరరావు సాహిత్యాన్నే కాదు ఆయన జీవితాన్ని కూడా చాలా దగ్గర నుంచి చూసిన వారిలో వేణు ముఖ్యుడు. వరవరరావు కవితల ఇంగ్లీషు అనువాదం వచ్చిందంటే ఇన్నాళ్లూ తెలుగు వారికి ప్రజాకవిగా ఉన్న వీవీ ఇక నుంచి ప్రపంచ ప్రజాకవిగా గుర్తించాల్సిందే. ప్రపంచ సాహిత్య సమాజం గుర్తించి చాలా కాలమే అయ్యింది. ఆ గుర్తింపునకు ఈ అనువాదం ఓ వాహిక మాత్రమే. అన్నట్టు... ఇదీ వీవీ కవిత్వమంటే...

"అకాల ధర్మం/కాలమేఘం కంఠాన్ని నొక్కితే
నెత్తురూ కారదు కన్నీరు రాలదు
ఉరికంబం/త్రాసువలె బరువుగా
భూమిలోకి అమరత్వాన్ని విత్తి
తెల్ల వలస తలారిని తేలిక పరుస్తుంది"

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

ఫ్రాన్సులో జాత్యహంకారంపై తిరుగుబాటు

టి.వి. సుబ్బయ్య

తాజాగా ఫ్రాన్సులో పాలకులు పాటిస్తున్న జాత్యహంకారం, వివక్షలపై తిరుగుబాటు జరిగింది. అమెరికాలో పాటిస్తున్న జాత్యహంకారమే ఫ్రాన్సులోనూ కనిపిస్తోంది. జాతివివక్ష, అణచివేత కొనసాగుతున్నది. సామాజిక రంగాలలో నల్లజాతి ప్రజలు, వలసవచ్చిన బన్లియూలపైన (ముస్లింలు) శ్వేతజాతీయులు గత ఆరు దశాబ్దాలకుపైగా ద్వేషం వెళ్లగక్కుతున్నారు. తమ దేశంలోకి వలసవచ్చినవారు పెద్దసమస్యగా శ్వేతజాతీయులు భావిస్తున్నారు. అమెరికాలో 2020 మే నెలలో శ్వేతజాతీయుడైన పోలీసు నల్లజాతీయుడు జార్జి ఫ్లాయిడ్‌ను మెడపైన బూటుకాలితో నొక్కి చంపిన దుర్మార్గంపై అక్కడ నల్లజాతీయులు కొన్ని వారాలపాటు తీవ్ర ఆందోళన జరిపారు. అనేక నగరాలలో లూటీలు, గృహ, కార్ల దహనాలు జరిగాయి. కల్లోల పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా ఫ్రాన్సులోనూ జరిగింది.

అల్జీరియా మూలాలున్న 17ఏళ్ల యువకుడు నహెల్ మెర్జౌక్‌ను పారిస్ నగర శివారు వెంటెర్రి ప్రాంతంతో 2023 జూన్ 27న పోలీసు కాల్చి చంపాడు. దీంతో ఆ ప్రాంతంలో దాదాపు ఒక వారం రోజులు రాత్రి, పగలు అల్లర్లు చోటుచేసుకున్నాయి. గృహ దహనాలు, లూటీలు, హింసాకాండ జరిగాయి. దాదాపు 200 నగరాలు, పట్టణాల్లో అల్లకల్లోలం చోటు చేసుకుంది. ట్రాఫిక్ పోలీసు తాను ఆపేందుకు ప్రయత్నించినా ఆగకుండా నహెల్ ట్రాఫిక్ సిగ్నల్ దాటి వెళ్లిపోయాడని దీనితో కాల్చివేసినట్లు చెప్పారు. అయితే నహెల్ నల్ల జాతీయుడు గనుకనే కాల్చి చంపాడన్నది బాధితుల ఆరోపణ. వాస్తవం శ్వేతజాతీయులు బన్లియూలు (ముస్లింలు), నల్లజాతీయులపై పెంచుకున్న కక్ష, ద్వేషమే కాల్చివేతకు దారితీసింది. 17వ శతాబ్దిలో నెపోలియన్ ఆధ్వర్యంలో జరిగిన విప్లవంనాటి పరిస్థితులు ఇప్పుడు లేవు. మత, మితవాదులు, నియంత హిట్లర్ మాదిరిగా చాలా దేశాల్లో అధికారంలోకి వస్తున్నారు. ప్రజాస్వామ్యం ముసుగులో నియంతృత్వ పోకడలుపోతూ అధికారాన్ని చెలాయిస్తున్నారు. అమెరికాలో జార్జిఫ్లాయిడ్‌ను కూడా జాతి వివక్షతోనే కాల్చి చంపాడన్న విషయం తెలిసిందే. ఫ్లాయిడ్‌ను చంపిన శ్వేతజాతీయుడైన అధికారిని తొలగించేవరకు ఆందోళన జరిగింది. ఫ్రాన్సులో ఇటాంటి సంఘటనలు చాలాసార్లు జరిగాయి.

ఫ్రాన్సులో నల్ల జాతీయులకు, బన్లియూలకు రద్దు చేసిన ఓటు హక్కును తిరిగి కల్పించాలని, అణచివేతను, పేదరికాన్ని నిర్మూలించాలని, జాతి వివక్షకు అంతం పలకాలని డిమాండ్ చేస్తున్నారు. అక్కడ ముస్లింలపై విద్వేషం పెంచుకున్నట్లుగానే భారతదేశంలో బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఫ్రాన్సు సమాజం రెండుగా చీలిపోయిందని అనేకమంది విశ్లేషకులు, స్థానిక పత్రికలు వ్యాఖ్యానించాయి. ఆర్థిక, సామాజిక అసమానతలు అత్యంత తీవ్ర సమస్యగా మారాయి. తాజాగా జరిగిన అల్లర్లలో బన్లియూలు ఎక్కువగా నివసిస్తున్న ప్రాంతాల్లో నష్టం ఎక్కువగా జరిగింది. ఈ పరిస్థితి భారతదేశంలోనూ ఉంది. ముస్లిం ప్రాంతాల్లో నష్టాలు ఎక్కువగా ఉన్న దుస్థితిని మనం చూస్తున్నాం. వలస దేశాలన్నింటిలోనూ అణగారిన వర్గాల ప్రజలపై వివక్ష ఆధునిక కాలంగా చెప్పుకుంటున్న నేటికీ కొనసాగడం విచారకం. దీర్ఘకాలంగా అధికారం చెలాయిస్తున్న ప్రధానమంత్రులు జాతి వివక్షను అంతంచేసే చర్యలు తీసుకోలేదు. అందువల్లనే చాలాసార్లు ఫ్రాన్సులో అల్లర్లు, హింసాకాండ చోటుచేసుకుంటున్నాయి.

పోలీసు చంపిన నహెల్

2005లో ఫ్రాన్సు సమాజంలో తీవ్ర కల్లోలం చోటుచేసుకున్నది. అలాగే అంతక్రితం 1968లో ఇద్దరు నల్లజాతి విద్యార్థులను పోలీసులు స్టేషన్‌లో దాచిపెట్టి విద్యుత్ షాక్ ద్వారా చంపివేశారు. ఈ దుర్ఘటనతో ఫ్రాన్స్ నలుమూలలా అల్లర్లు, వాహనాలు, గృహాలు దహనం, హింసాకాండ అంతక్రితం ఏనాడూ లేని స్థాయిలో జరిగింది. దేశవ్యాప్తంగా ప్రజల్లో భీతి ఏర్పడింది. పారిస్‌కు ఈశాన్య ప్రాంతంలో ఇద్దరు విద్యార్థులను చంపివేసిన ఘటనకు జాత్యహంకారమే కారణం. మూడు వారాలకుపైగా దేశంలో బీభత్సకాండ కొనసాగింది. అనేక డజన్ల పట్టణాలు, నగరాల్లో నిత్యజీవనం దాదాపు స్తంభించింది. ఈ సారి జరిగిన ఘటనపై లిమాండే పత్రిక సంపాదకీయం రాసింది. అమెరికాలో 2020లో ఫ్లాయిడ్‌ను చంపిన ఘటన లాంటిదే ఫ్రాన్సులో జరిగిందని ప్రస్తావించింది. జాతి వివక్షను ఖండించింది. 2005లో జరిగిన అల్లర్ల సందర్భంగా నాటి అధ్యక్షుడు నికొలస్ సర్కొజీ దేశంలో అత్యవసర పరిస్థితిని విధించడమేగాక బాధితులను రెచ్చగొట్టారు. నల్లజాతీయులకు, బన్లియూలకు, ఇతర మైనారిటీలకు ఏ హక్కులను లేకుండా చేయడంపై ప్రజలు తీవ్రంగా నిరసించారు. ఈ నిరసన ర్యాలీల్లో వామపక్ష నాయకులు, కార్యకర్తలు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఫ్రాన్స్ నగరాల శివారు ప్రాంతాల్లో బహుళజాతులు నివసిస్తున్నాయి. నల్లజాతి, బన్లియూలు తదితర జాతులున్నాయి. వెలివేసినట్లుగా ఉన్న ఈ ప్రాంతాల్లో సరైన వసతులు లేకపోవడంతో పాటు ప్రజలు పేదరికంలో ముగ్గుతున్నారు. జాతి వివక్షపై ఆయా దేశాలు ఏనాడూ చర్చించి పరిష్కరించాలని చూడలేదు. పైగా జాతుల్లో కొన్ని చోట్ల కులాలు, మతాల ఆధారంగా హింస జరుగుతూనే ఉంది. అంటరానితనం జాడ్యం ఆధునిక సమాజంలో పెరగడం గమనిస్తున్నాం. వలసలను కూడా ఆయా సమాజాలు నిరోధించడానికి, మత మైనారిటీలను దేశాల నుండి తరిమివేయడానికి 'ఆధునిక' పాలకులు యత్నిస్తున్నారు.

పలస్తీనా భూభాగాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించుకొని 56ఏళ్లు గడిచింది. అయినా పలస్తీనా ప్రజలు స్వాతంత్ర్యంకోసం పోరాడుతూనే ఉన్నారు. ఇజ్రాయిల్ అధ్యక్షుడు నెతన్యాహు అమెరికా అండదండలతో పలస్తీనా ప్రజలపై దాడులు సాగిస్తూనే ఉన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ తిరుగుబాటుకు దారితీసిన సమస్యలను గుర్తించినప్పటికీ వాటిని పరిష్కరించరు. నెతన్యాహు, మాక్రాన్‌లు అనుసరిస్తున్న విధానాలు కాస్త తేడాతో ఒకే రకంగా ఉన్నాయి. ఫ్రాన్సులో తిరుగుబాటు ఆందోళనలు గతంలోనూ జరిగాయి. నహెల్ కాల్చివేతకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేయిస్తానని ప్రకటించారు. అయితే పోలీసు కమిషనర్ మాత్రం యువకుడిని కాల్చివేసిన ఘటనను సమర్థించారు. నహెల్ స్మారక ప్రదర్శనను పోలీసులు తిరస్కరించినప్పటికీ రెండు వేలమందికి పైగా పారిస్‌లో ర్యాలీ చేశారు. జాతి వివక్షతతో కావాలని నహెల్‌ను హత్య చేశారని ఫ్రాన్సు అంతటా నిరసన ర్యాలీలు జరిగాయి. ఫ్రాన్సు విదేశాంగ మంత్రిత్వశాఖ సైతం తమపై వచ్చిన ఆరోపణలను తిరస్కరించింది. నయానాజీల ప్రదర్శనలకు అనుమతిస్తున్నారు. అన్ని జాతుల ప్రజలు ఒకటేనని, అందరికీ సమానహక్కులు లేని పరిస్థితి ఇక్కడ ఉంది. ద్వేషం, పగ, ప్రతీకారం విడనాడేవరకు హింసాత్మక ఘర్షణలు, అల్లర్లు కొనసాగే అవకాశం ఉంటుంది.

తగ్గుతున్న మత విశ్వాసాలు

సత్య

భగవంతుడు ఉన్నట్లు తాము చెప్పలేమని సగం మంది అమెరికన్లు భావిస్తున్నారని ఇటీవలి జనరల్ సోషల్ సర్వే చికాగో విశ్వవిద్యాలయం వెల్లడించింది. 1972 నుంచి ఈ సంస్థ అమెరికా సామాజిక ధోరణుల మీద జరుగుతున్న సర్వేల ప్రకారం ప్రస్తుతం సగం మంది అమెరికన్లు మాత్రమే దేవుడి ఉనికి గురించి గట్టి విశ్వాసంతో ఉన్నారట. 1993లో మూడింట రెండు వంతులు, 2008లో 60 శాతం నుంచి ఇప్పుడు 50శాతానికి తగ్గారు. జనాభాలో అసలు చర్చ్‌కు వెళ్లని వారు 34 శాతం ఉన్నారని, గడచిన ఐదు దశాబ్దాల్లో ఇది అధికమని తేలింది. మరణం తరువాత జీవితం ఉంటుందనే నమ్మకం మాత్రం ఎక్కువ మందిలో ఉంది. తాము క్రైస్తవులమని చెప్పుకున్న వారు 1990 దశకంలో 90శాతం ఉండగా ఇప్పుడు మూడింట రెండు వంతులకు తగ్గారు. పిఆర్‌ఆర్‌ఐ సర్వే ప్రకారం 2008లో తమకెలాంటి మత అనుబంధం లేదని చెప్పిన వారు 16శాతం కాగా 2022లో 27శాతానికి పెరిగారు. ఏసు క్రీస్తును రక్షకుడు, ప్రభువు అని గట్టిగా నమ్మే ఇవాంజెలికల్ ప్రొటెస్టెంట్స్ ఇదే కాలంలో 23 నుంచి 13.6శాతానికి తగ్గారు. 1965-81 కాలంలో పుట్టిన జనరేషన్ ఎక్స్‌లో 25శాతం, 1982-2004 మధ్య పుట్టిన మిలీనియల్స్‌లో 29శాతం 1996-2010 మధ్య జన్మించిన జడ్ తరంలో 34శాతం మంది ఏ చర్చ్‌కు అనుబంధంగా లేరు. " మతం నుంచి స్వేచ్ఛ ఫౌండేషన్ " సహ అధ్యక్షుడు డాన్ బార్కర్ ప్రపంచంలో మతం గురించి, మారుతున్న వైఖరిమీద స్పందిస్తూ అమెరికాలో బలమైన మతవిశ్వాసాలు ఉన్నవారు తగ్గటాన్ని హర్షిస్తూ, ఇతర ఐరోపా దేశాలతో అమెరికా పోటీ పడుతున్నదన్నాడు.

ఒక దేశంలో మెజారిటీ మతం మరొక చోట మైనారిటీగా ఉండవచ్చు. మన దేశంలో హిందూ అని పిలుస్తున్న మతంలో వివిధ శాఖలు ఉన్నట్లుగానే క్రైస్తవం, ఇస్లాం, ఇతర మతాల్లో కూడా ఉన్నాయి. తమ దేశంలోని 75వేల మసీదుల్లో 50వేలను మూసివేసినట్లు ఇరాన్ మౌలానా మహమ్మద్ అబోలఘాసిమ్ దౌలబీ జూన్ ఒకటిన చెప్పాడు. మసీదులకు వచ్చేవారు గణనీయంగా తగ్గటమే దీనికి కారణం అన్నాడు. ఆయన ప్రభుత్వం-మత సంస్థల సమన్వయకర్తలలో ఒకడు. దీని గురించి హిందూత్వకు పక్కాగా మద్దతు



పలికే, ముస్లింల మీద విద్వేషాన్ని వెదజల్లుతుందనే విమర్శ ఉన్న ఓపి ఇండియా వెబ్‌పోర్టల్ రాసింది. ఇస్లామిక్ విశ్వాసాలతో ఛాందసవాదుల హవా నడుస్తున్న చోట ఇలాంటి పరిణామం మన దేశాన్ని హిందూ ఛాందసవాదం, మనువాద హిందూత్వం వైపు తీసుకుపోవాలని చూస్తున్న శక్తులకు ఆందోళన కలిగిస్తున్నట్లు చెప్పవచ్చు. హిజాబ్ వ్యతిరేక ఆందోళనకు దిగిన ఇరాన్ మహిళలకు ప్రపంచమంతా జేజేలు పలికింది. అదే తీరున మన దేశంలో కూడా మతఛాందసులు, మతోన్మాదుల అజెండా మేరకు సమాజాన్ని నడిపితే ఇక్కడ కూడా వ్యతిరేకత వెల్లడైతే హిందూత్వ అజెండా కుప్పకూలుతుందన్న భయం ఆశక్తులకు కలగటం సహజం. ఇరాన్ మతశక్తులు పౌరుల జీవితాల మీద మతాన్ని రుద్దటాన్ని అక్కడి సమాజం తిరస్కరించటం నానాటికీ పెరుగుతోంది. శిక్షను సహించటం లేదు. "సమాజంలోని బలమైన మత భావనలు అంతరిస్తున్నాయి. మతం ఇచ్చేదాన్ని జనం చూస్తారు, మతం పేరుతో జనాలను అవమానించటం, మత బోధనలు, భావనల పేరుతో మతపరమైన కల్పనలతో సహా అనేక కారణాలు, ఇంకా మతం పేరుతో పౌరులకు గౌరవ ప్రదమైన జీవితాన్ని నిరాకరించటం, వారిని దారిద్ర్యంలో నెట్టటం వంటి అంశాలను బట్టి ఆ మతంలో చేరాలా లేక దాన్ని వదలి వెళ్లాలా అని నిర్ణయించుకుంటారు." అని కూడా మౌలానా చెప్పినట్లు వార్తలు వచ్చాయి. హిజాబ్‌ను సరిగా ధరించలేదనే కారణంతో నైతిక పోలీసులు గతేడాది సెప్టెంబరులో మహసా అమిని అనే యువతిని దారుణంగా కొట్టి చంపటంతో పెద్ద ఎత్తున ఇరాన్‌లో నిరసనలు చెలరేగిన సంగతి తెలిసిందే. ప్రార్థనలకు వచ్చేవారు లేక 60శాతం మసీదులను మూసినట్లు వార్తలు వచ్చాయి.

లవ్ జీహాద్, లాండ్ జీహాద్‌కు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఉత్తరాఖండ్‌లోని ఉత్తర కాశీ జిల్లా పురోలా పట్టణంలో ఉన్న ముస్లింలందరూ వెళ్లిపోవాలంటూ హిందూత్వ పేరుతో ఉన్న శక్తులు జూన్ 15వ తేదీ గడువు నిర్ణయించి బెదిరింపులకు దిగిన సంగతి తెలిసిందే. హిందువుల్లో ఒక కులం వారు మరొక కులం వారిని వివాహం చేసుకోకూడదంటూ ఉత్తరాది రాష్ట్రాలలో తీర్పులు చెప్పే పంచాయత్‌లను చూస్తున్నాము. ఇది వ్యక్తిగత జీవితాల్లో జోక్యం చేసుకోవటం తప్ప వేరు కాదు. ఇదే పని ఇతర మతఛాందసులు చేసినా అదే అవుతుంది. రెచ్చిపోతున్న మతశక్తులను చూస్తే మన దేశం కూడా ఈ రోజుగాకపోతే రేపు మరో ఇరాన్ అవుతుంది. ముస్లింలు, హిందువులు, క్రైస్తవులు తమ దేశంలో బౌద్ధం అంతరించటానికి కారకులౌతున్నారంటూ శ్రీలంకలోని బౌద్ధ మత ఛాందసులు రెచ్చిపోతున్నారు. రెచ్చగొట్టి దాడులకు పాల్పడేందుకు చూస్తున్నారు.

మతంతో నిమిత్తం లేనివారు అమెరికాలో పెరుగుతున్న కారణంగా ప్రతి ఏటా అనేక చర్చ్‌లు మూతపడుతున్నట్లు వార్తలు. చర్చి ప్రాంగణాలను కొనుగోలుచేసేవారికి భలేమంచి చౌకబేరం అన్నట్లుగా ఉంది. 2019లో నాలుగున్నరవేల ప్రొటెస్టెంట్ చర్చ్‌లు మూతపడితే, గతేదాది మూడువేల కొత్త చర్చ్‌లు ప్రారంభమైనట్లు వార్తలు. మొత్తం మీద జనాలు చర్చ్‌లకు రాకపోవటం తాత్కాలికమా లేక అదే ధోరణి ముందు కూడా కొనసాగుతుందా అన్నది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. గడచిన మూడు సంవత్సరాల ధోరణులను చూసినపుడు మూసివేతలకే ఎక్కువ అవకాశాలున్నట్లు కొందరు భావిస్తున్నారు. కరోనా తరువాత చర్చ్‌లకు వస్తున్నవారిని చూస్తే అంతకు ముందు వచ్చే వారిలో 85శాతమే ఉన్నట్లు ప్రొటెస్టెంట్ పాస్టర్లు నివేదించారట. కరోనాకు ముందు ఏడాదికి కనీసం ఒకసారి చర్చ్‌కు వచ్చినవారు 75 శాతం ఉంటే గతేడాది 67కు తగ్గారు. కుర్రకారు హైస్కూలు చదువులో ఉండగా కనీసం ఒకఏడాది పాటు చర్చ్‌కు ప్రతివారం వచ్చేవారని 2017 వివరాలు వెల్లడించగా ఇప్పుడు ప్రతి పదిమందిలో ఏడుగురు రావటం లేదని లైఫ్‌వే పరిశోధనలో తేలింది. మతంతో సంబంధం లేకుండా పిల్లల్ని పెంచుతున్నవారు పెరగటం దీనికి ఒక కారణం అంటున్నారు. ప్యూ సంస్థ విశ్లేషకులు చెప్పినదాని ప్రకారం 1972లో 92 శాతం మంది అమెరికన్లు క్రైస్తవులుగా చెప్పుకోగా 2070 నాటికి 50శాతం లోపుకు పడిపోవచ్చుట. ఇప్పుడున్న వారిలో తాతలు ప్రతివారం చర్చ్‌కు వెళ్లి ఉంటారని, వారి పిల్లలు తమకు దేవుడు అంటే విశ్వాసం అని చెప్పారు తప్ప ప్రతివారం విధిగా చర్చ్‌కు వెళ్లలేదని, మిలీయన్ మనవల దగ్గరకు వచ్చేసరికి చర్చికి వెళ్లే సంబంధాలు గానీ, మతంతో గానీ అనుభవం తక్కువని కొందరు విశ్లేషకులు చెప్పారు. కాథలిక్ చర్చ్‌లో సెక్స్ కుంభకోణాల కారణంగా జనాలు చర్చ్‌లకు దూరంగా ఉంటున్నారని, దానికి కరోనా కూడా తోడైందని కూడా తేలింది.

కెనడా, బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో ఇలాంటి పరిణామం ముందే జరిగిందని, అమెరికాలో మెల్లగా జరుగుతోందని చెబుతున్నారు. దీనికి సోషలిస్టు దేశాలతో అమెరికా జరిపిన ప్రచ్ఛన్న యుద్ధం కారణమని ఒక విశ్లేషకుడు పేర్కొన్నారు. క్రైస్తవ అమెరికా-దేవుడులేని కమ్యూనిజం మధ్య పోరు జరుగుతోందని, మతం లేని వారు అసలు అమెరికన్లే కాదని రెచ్చ గొట్టారు. (ఇప్పుడు మన దేశంలో ఎవరైనా బీజేపీ, సంఘపరివార్, హిందూత్వ సంస్థలను లేదా మతంలోని అవ లక్షణాలను, మూఢ విశ్వాసాలను ఎవరైనా విమర్శిస్తే లేదా వారితో ఏకీభవించకపోతే మీరు హిందువులే కాదంటూ రెచ్చగొడుతున్న తీరు చూస్తున్నదే).

పంజాబ్, హరియాణాలో వరద సహాయచర్యలు

ముమ్మరం

చండీగఢ్: పంజాబ్, హరియాణాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. నివాసిత కాలనీల్లో నిలిచిన నీటిని తోడివేసేందుకు అధికారులు మోటారు పంపులను ఉపయోగిస్తున్నారు.

వరదలో చిక్కుకున్న నివాసితులకు నిత్యావసరాలు, తాగునీటిని పంపిణీ చేశారు. పంజాబ్‌లోని వివిధ వరద బాధిత జిల్లాల్లో ఇప్పటివరకు 19,000 మందికి పైగా ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాగా పొరుగున ఉన్న హరియాణాలో 3,674 మందిని తరలించినట్లు అధికారులు తెలిపారు. మొత్తంమీద పంజాబ్‌లో 14, హరియాణాలో 10 జిల్లాలు వరదలకు ప్రభావితమయ్యాయి. శనివారం నుంచి సోమవారం వరకు కురిసిన భారీ వర్షాలకు రెండు రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఇప్పటివరకు రెండు రాష్ట్రాల్లో వర్షాలకు సంబంధించిన సంఘటనలలో 27 మంది మరణించారు. హరియాణాలో 16 మంది మరణించారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ జలంధర్‌లోని ఫిరోజ్‌పూర్‌కు వెళ్లి పరిస్థితిని సమీక్షించారని అధికారులు తెలిపారు. ఫతేఘర్ సాహిబ్ సహా కొన్ని ప్రాంతాల్లో వరద నీరు తగ్గుముఖం పట్టినట్లు వారు పేర్కొన్నారు. అయితే ఘగ్గర్ నది ఉధృతంగా ప్రవహించడంతో సంగ్రూర్‌లోని మూనాక్ సబ్ డివిజన్‌లోని వివిధ గ్రామాలు ముంపునకు గురయ్యాయని వెల్లడించారు. లుథియానాలో తాజ్‌పూర్ రోడ్, ధోకా మొహల్లా, ధర్మ్ పురా, శివపురి, శివాజీ నగర్, కశ్మీర్ నగర్‌లలో అనేక కాలనీల్లోకి బుద్ధా నల్లా (కాలువ) కలుషిత నీరు ప్రవేశించింది. ఈ కాలనీల్లోని నీటిని బయటకు పంపేందుకు మోటారు పంపులను వినియోగిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. త్వరలో పరిస్థితి మెరుగుపడుతుందని ఆప్ ఎమ్మెల్యే మదన్ లాల్ బగ్గా ఆశాభావం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముంపునకు గురైన కాలనీల్లో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని సీపీఐ నేత అరుణ్ మిత్రా ఆందోళన వ్యక్తం చేశారు. వరద ప్రభావిత కాలనీల నివాసితులకు అతిసారం, చర్మ వ్యాధులు, శ్వాసకోశ వ్యాధుల ప్రమాదం ఎక్కువగా ఉందని, ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. బుద్ధ నల్లా, లుథియానా నగరం నుంచి పారిశ్రామిక వ్యర్థాలు, ఘన వ్యర్థాలు, గృహ వినియోగ మురుగునీటిని తీసుకువెళుతుంది. కాగా పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం వరద పరిస్థితిని ఎదుర్కోవడంలో విఫలమైందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. ఆప్ ప్రభుత్వాని ముందుచూపు కొరవడిందని, సరైన సన్నద్ధత లేదని విమర్శించాయి. దీనిపై ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తోసిపుచ్చుతూ ప్రతిపక్షాలు ప్రకృతి విపత్తుపై రాజకీయాలు చేయడంలో మునిగిపోయాయన్నారు. వరదల కారణంగా పంజాబ్ నష్టాన్ని అంచనా వేసి కేంద్రానికి పంపుతామని, అయితే ఆర్థిక ప్యాకేజీ కోసం అడుక్కోవడం లేదని ఆయన అన్నారు. హరియాణాలో 854 గ్రామాలు వరదల బారిన పడగా, 126 ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, 106 పాక్షికంగా దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 12 సహాయ శిబిరాల్లో 1,819 మంది ఆశ్రయం పొందుతున్నారని వారు తెలిపారు. వర్షాల వల్ల రాష్ట్రంలో 1.24 లక్షల హెక్టార్లకు పైగా పంటలు దెబ్బతిన్నాయి. అంబాలా, ఫతేహాబాద్, ఫరీదాబాద్, పంచకుల, ఝజ్జర్, కురుక్షేత్ర, కర్నాల్, పానిపట్, సోనిపట్, యమునానగర్ జిల్లాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

5వేలమంది నిరాశ్రయులకు భోజన ఏర్పాట్లు

నోయిడా (ఉత్తరప్రదేశ్): వరద సహాయక చర్యల్లో భాగంగా 5వేల మందికి పైగా నిరాశ్రయులకు గౌతమ్ బుద్ధనగర్ జిల్లా అధికార యంత్రాంగం శుక్రవారం ఉచిత అల్పాహారం, భోజనం అందించినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. వరదల్లో చిక్కుకున్న ప్రజలు, పశువులను ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సురక్షిత ప్రాంతాలకు తరలించడం కొనసాగించాయని వారు తెలిపారు. జిల్లా మేజిస్ట్రేట్ మనీష్ కుమార్ వర్మ, పోలీసు కమిషనర్ లక్ష్మీ సింగ్ క్షేత్రస్థాయిలో సహాయ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారని జిల్లా సమాచార అధికారి రాకేష్ చౌహాన్ తెలిపారు. సమాయ శిబిరాల్లో ఉన్న వారికి, ఇప్పటికీ వరదలో చిక్కుకుపోకి ఉన్న వారికి అవసరమైతే మరో రెండు రోజులు అల్పాహారం, భోజనం అందించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు.

దిల్లీలో తేలికపాటి వర్షం

న్యూదిల్లీ: యమునా నది ఉప్పొంగి ప్రవహించడంతో దేశ రాజధాని దిల్లీని వరద నీరు చుట్టుముట్టిన సంగతి విదితమే. కాగా శుక్రవారం మధ్యాహ్నం కొన్ని ప్రాంతాలలో తేలికపాటి వర్షపు జల్లులు కురియడంతో దేశ రాజధాని వాసులు ఆందోళనకు గురయ్యారు. లక్ష్మీనగర్ ప్రాంతాలు, తూర్పు దిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో తేలిక పాటి వర్షం నమోదైంది. లుటియన్స్ దిల్లీతో సహా ఇతర ప్రాంతాలలో జల్లులు కురిశాయి. కాగా పొంగిపొర్లుతున్న యమునా నది వరద శుక్రవారం సెంట్రల్ దిల్లీలోని సుప్రీంకోర్టు ప్రవేశ ద్వారం వద్దకు చేరుకుందని ఇంద్రప్రస్థలోని దిల్లీ ఇరిగేషన్ అండ్ ఫ్లడ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ రెగ్యులేటర్ వెల్లడించింది. ఇక్కడి యమునాలో నీటి మట్టం 208.35 మీటర్లకు తగ్గింది.

ఆసుపత్రిలో శరద్‌పవార్ భార్య

న్యూదిల్లీ: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) వ్యవస్థాపకుడు శరద్ పవార్ భార్య ప్రతిభా పవార్ శుక్రవారం దక్షిణ ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చేరారు. అక్కడ ఆమెకు చేతికి సంబంధించిన శస్త్రచికిత్స చేయనున్నట్లు పార్టీ కార్యకర్త ఒకరు తెలిపారు. ఎన్సీపీ నాయకులు 'కాకి' అని పిలుచుకునే ప్రతిభా పవార్ ను పార్టీ మాతృకగా పేర్కొంటారు. కానీ ఆమె ఎప్పుడూ రాజకీయాల్లో క్రియాశీలకంగా లేరు.

సిసోదియా బెయిలు దరఖాస్తు...

సీబీఐ, ఈడీలకు సుప్రీం నోటీసులు



న్యూదిల్లీ: మద్యం కుంభకోణం కేసులో నిందితుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా బెయిలు దరఖాస్తుపై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. ఆప్ నాయకుడు సిసోదియా తాత్కాలిక బెయిల్‌పై జులై 28న స్పందించాలని సీబీఐ, ఈడీలకు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బేలా ఎం త్రివేది, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపింది. సిసోదియా భార్య ఆరోగ్యం బాగా క్షీణించిందని, ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, అందువల్ల అత్యవసరంగా బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరపు సీనియర్ న్యాయవాది మనీశ్ సింఘ్వీ అభ్యర్థించారు. సిసోదియా సతీమణి అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆమెను చూసేందుకు అత్యవసరంగా తాత్కాలిక బెయిలు మంజూరు చేయాలని దాఖలైన పిటిషన్‌పై జులై 28న విచారణ జరిపేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. మనీశ్ సిసోదియా ఫిబ్రవరి 26 నుంచి జైలులో ఉన్న విషయం తెలిసిందే. సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్న కేసుల్లో తనకు బెయిలు మంజూరు చేయాలని సిసోదియా రెండు పిటిషన్లను సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. దిల్లీ హైకోర్టు తనకు బెయిలు నిరాకరించడాన్ని సవాలు చేస్తూ ఈ పిటిషన్లు దాఖలు చేశారు. అవినీతి నిరోధక చట్టం ప్రకారం సిసోదియాపై సీబీఐ, మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి. సిసోదియాపై వచ్చిన ఆరోపణలను ధ్రువీకరించేందుకు తగిన ఆధారాలేవీ లేవని ఆయన తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి సుప్రీంకోర్టుకు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న భార్యను చూసేందుకు సిసోదియాకు అవకాశం కల్పించాలని, తాత్కాలిక బెయిలు మంజూరు చేయాలని కోరారు. తాత్కాలిక బెయిలు కోసం చేసిన దరఖాస్తును ఆగస్టు 21న విచారిస్తామని సుప్రీంకోర్టు చెప్పింది. అయితే అంతకన్నా ముందే విచారణ జరపాలని సింఘ్వి కోరగా జులై 28న విచారణకు అనుమతిచ్చింది.

ప్రభుత్వ ఉదాసీనత వల్లే తీవ్ర నష్టం

వరద నష్టంపై సర్వే చేయించాలి

రైతులకు ఎకరాకు రూ.40వేల పరిహారం

హరియాణా కాంగ్రెస్ డిమాండ్

చండీగఢ్: హరియాణాలో వరద బాధిత ప్రాంతాల్లో పంటలు, ఆస్తి నష్టాన్ని అంచనా వేయడానికి తక్షణం సర్వే చేయించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని కోరింది. ఈ మేరకు ప్రతిపక్ష నాయకుడు భూపిందర్ సింగ్ హుడా, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాన్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రతినిధి బృందం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయకు మెమోరాండం సమర్పించింది. ఇటీవలి భారీ వర్షాల కారణంగా పంచకుల, అంబాలా, యమునానగర్ కురుక్షేత్ర , కర్నాల్, పానిపట్, సోనిపట్ జిల్లాల్లో అనేక ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యాయి. ప్రభుత్వం సకాలంలో సరైన చర్యలు తీసుకోకపోవడంతో నష్టం తీవ్రంగా జరిగిందని కాంగ్రెస్ పార్టీ మెమోరాండంలో పేర్కొంది. ప్రభుత్వం వాతావరణ శాఖ హెచ్చరికల్ని విస్మరించి నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, అధికారుల ఉదాసీనత కారణంగా ప్రజలు బాధితులుగా మారారని తెలిపింది. నిర్వాసితులైన లేదా ఇళ్లు దెబ్బతిన్న వారికి పునరావాసం కల్పించాలని పార్టీ డిమాండ్ చేసింది. వ్యాపారులకు జరిగిన నష్టాన్ని సర్వే చేసి తగు పరిహారం ఇవ్వాలని, నిరుపేదలకు ఆహార పదార్థాలు, పశువులకు మేత పంపిణీ చేయాలని, భవిష్యత్తులో వరద ముంపు నివారణకు తక్షణ, దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాలని పేర్కొంది. లక్షలాది ఎకరాల్లో పంటలు నీటమునిగి పూర్తిగా నాశనమయ్యాయని, అనేక రహదారులు, హైవేలు దెబ్బతిన్నాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపింది. ఇన్ని రోజులు

గడుస్తున్నా బాధిత గ్రామాలకు ప్రభుత్వ అధికారులు రాలేదని కాంగ్రెస్ పేర్కొంది. రాష్ట్ర ప్రజల కష్టాలను తీర్చడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో కాంగ్రెస్ పార్టీ అన్నివిధాలుగా సహాయ, సహకారాలను అందజేస్తుందని కాంగ్రెస్ ప్రతినిధి బృందం గవర్నర్‌కు హామీ ఇచ్చింది.

మణిపూర్‌లో చర్చి దహనానికి నిరసనగా

మిజోరం బీజేపీ ఉపాధ్యక్షుడి రాజీనామా

అమిత్‌షా, బీరెన్‌సింగ్ ఖండించలేదని వెల్లడి

న్యూదిల్లీ : మణిపూర్‌లో చర్చి దహనానికి నిరసనగా మిజోరం బీజేపీ నాయకుడు ఆర్. వన్‌రామ్‌చువాంగా రాష్ట్ర శాఖ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఈ నెల 13 నాటి తన రాజీనామా లేఖలో, మణిపూర్‌లో ఇటీవల జరిగిన క్రైస్తవ చర్చిల విధ్వంసం 'రాష్ట్ర, కేంద్ర అధికారుల మద్దతుతో' జరిగిందని పేర్కొన్నాడు. క్రైస్తవుల పట్ల 'నేరపూరిత అన్యాయానికి వ్యతిరేకంగా నిరసన' చేయడానికి తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు వన్‌రామ్‌చువాంగా తెలిపాడు. మణిపూర్‌లో ఇటీవలి జాతి ఘర్షణలు చెలరేగడంతో 357 క్రైస్తవ చర్చిలు, పాస్టర్ క్వార్టర్‌లు, వివిధ మత సంస్థలకు చెందిన కార్యాలయ భవనాలు 'మైతేయి తీవ్రవాదులచే బూడిదకు గురయ్యాయి' అని పేర్కొన్నాడు. మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ లేదా కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇంఫాల్ పర్యటన సందర్భంగా చర్చి భవనాల దహనం వెనుక నేరస్తులను ఖండించలేదని లేదా నిందలు వేయలేదని మిజోరాం రాష్ట్ర అధ్యక్షుడిని ఉద్దేశించి వన్‌రామ్‌చువాంగా తన లేఖలో పేర్కొన్నారు. 'క్రైస్తవ చర్చిలను తగులబెట్టడాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా ఖండించలేదు' అని ఆయన ఆ లేఖలో రాశారు. ఈ ఏడాది చివరిలో మణిపూర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో వన్‌రామ్‌చువాంగా రాజీనామా చేయడం గమనార్హం. ఈశాన్య రాష్ట్రంలో మైతేయి, కుకీ వర్గాల మధ్య జాతి ఘర్షణలు చెలరేగినప్పటి నుంచి ఇప్పటివరకు 150 మందికి పైగా మరణించగా, చాలా మంది గాయపడ్డారు. షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ) హోదా కోసం మైతేయి డిమాండ్‌కు వ్యతిరేకంగా మే 3న రాష్ట్రంలోని కొండ జిల్లాల్లో 'గిరిజన సంఘీభావ యాత్ర' నిర్వహించిన తర్వాత రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. ఘర్షణల కారణంగా వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. సహాయక శిబిరాల్లో నివసిస్తున్నారు. భారీ సంఖ్యలో పారామిలటరీ బలగాలు ఉన్నప్పటికీ, హింస అడపాదడపా జరుగుతూనే ఉంది.

'కునో'లో మరో చిరుత మృతి

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కులో మరో చిరుత (చీతా) చనిపోయింది. దక్షిణాఫ్రికా నుంచి తీసుకొచ్చిన సూరజ్ అనే చిరుత శుక్రవారం తుదిశ్వాస విడిచింది. దీంతో ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు ఈ పార్క్‌లో ప్రాణాలు కోల్పోయిన చీతాల సంఖ్య ఎనిమిదికి చేరింది. గతేడాది సెప్టెంబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వ చిరుతల పునరుద్ధరణ కార్యక్రమానికి ఇది భారీ ఎదురుదెబ్బగా మారింది. సూరజ్ మరణానికి కారణాలను తెలుసుకుంటామని పార్క్ అధికారులు చెప్పారు. ఈ పార్క్‌లో ఉంటున్న తేజస్ అనే మగ చీతా మంగళవారం మరణించింది. ఓ ఆడ చిరుతతో జరిగిన ఘర్షణలో దీనికి తీవ్రమైన షాక్ తగిలిందని, దాని నుంచి అది కోలుకోలేకపోయిందని పోస్ట్‌మార్టం నివేదిక వెల్లడించింది. కాగా మార్చి 27న సాషా అనే ఆడ చీతా మూత్రపిండాల వ్యాధితో మరణించింది. ఏప్రిల్ 23న ఉదయ్ అనే చీతా కార్డియో-పల్మనరీ వైఫల్యంతో ప్రాణాలు కోల్పోగా మే 9న దక్ష అనే ఆడ చీతా... ఓ మగ చిరుత పులితో సంతానోత్పత్తి ప్రక్రియలో పాల్గొన్నపుడు మరణించింది. మే 25న రెండు చిరుత పులి పిల్లలు వడగాడ్పుల వాతావరణాన్ని తట్టుకోలేక, డీహైడ్రేషన్‌తో మరణించాయి. కేంద్ర ప్రభుత్వం చిరుత పులుల సంరక్షణ, అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. తాజాగా సూరజ్ అనే చిరుత మరణించడంతో ప్రభుత్వానికి శరాఘాతం తగిలినట్లయింది. ఆరు చిరుత పులులు మరణించిన అనంతరం కేంద్ర ప్రభుత్వ అధికారి ఒకరు మాట్లాడుతూ... వీటి పెంపకంలో ఎటువంటి లోపాలు జరగలేదన్నారు. చీతాల్లో 90 శాతం వరకు బాల్యంలోనే మరణిస్తాయని వన్యప్రాణులపై జరిగిన అధ్యయనాలు వెల్లడిస్తున్నాయన్నారు. సౌత్ ఆఫ్రికన్ వన్యప్రాణి నిపుణుడు విన్సెంట్ వాన్ డెర్ మెర్వె ఇటీవల మాట్లాడుతూ... ప్రభుత్వం చేపట్టిన చీతాల రీఇంట్రడక్షన్ ప్రాజెక్టులో మరిన్ని చీతాలు మరణించే అవకాశం ఉందని చెప్పారు. చీతాలు తమ సొంత సామ్రాజ్యాలను ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నించినపుడు పులులు, చిరుత పులులతో జరిగే ఘర్షణల్లో అవి ప్రాణాలు పోగొట్టుకుంటాయన్నారు.

జూన్‌లో భూమిపై అత్యంత వేడి

నాసా, ఎన్‌వోఏఏ శాస్త్రవేత్తలు

న్యూదిల్లీ : గత నెల 174 సంవత్సరాల క్రితం రికార్డులో అత్యంత వేడి నమోదయిన జూన్ అని నాసా, ఎన్‌వోఏఏకు చెందిన శాస్త్రవేత్తల స్వతంత్ర విశ్లేషణ పేర్కొంది. నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్‌వోఏఏ) కూడా వాస్తవంగా కచ్చితంగా (99 శాతం పైన) 2023 రికార్డులో ఉన్న 10 వెచ్చని సంవత్సరాలలో ఉంటుందని, 97 శాతం మేర మొదటి ఐదు స్థానాల్లో స్థానం పొందే అవకాశం తెలిపింది. ఎల్ నినో వాతావరణ నమూనా ప్రస్తుతం ఉష్ణోగ్రతలు చాలా వేడిగా ఉండడానికి ఒక కారణమని ఎన్‌వోఏఏ పేర్కొంది. చక్రీయ నమూనా పసిఫిక్ మహాసముద్రంలో సాధారణ నీటి కంటే వేడిని కలిగిస్తుంది. అదనపు వేడి ప్రపంచవ్యాప్తంగా వాతావరణాన్ని మారుస్తుంది. ప్రపంచ ఉష్ణోగ్రతలను పెంచుతుంది. యూరోపియన్ యూనియన్‌కు చెందిన కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ ప్రకారం, ఈ సంవత్సరం జూన్ ప్రపంచవ్యాప్తంగా 1991-2020 సగటు కంటే కేవలం 0.5 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ వేడిగా ఉంది. ఇదిమునుపటి రికార్డు గణనీయమైన తేడాతో జూన్ 2019ని మించిపోయింది. ప్రపంచవ్యాప్తంగా 174 సంవత్సరాల ఎన్‌వోఏఏ రికార్డులో జూన్ 2023 అత్యంత వెచ్చని జూన్‌గా రికార్డు సృష్టించింది. ఈ సంవత్సరం జనవరి నుంచి జూన్ వరకు ప్రపంచ ఉపరితల ఉష్ణోగ్రత రికార్డులో మూడవ అత్యంత వెచ్చని కాలంగా నమోదయిందని అది తెలిపింది. ఎన్‌వోఏఏకు చెందిన నేషనల్ సెంటర్స్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఇన్ఫర్మేషన్ (ఎన్‌సీఈఐ) శాస్త్రవేత్తలు జూన్ ప్రపంచ ఉపరితల ఉష్ణోగ్రత 20వ శతాబ్దపు సగటు 15.5 సెలియస్స్ కంటే 1.05 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉందని కనుగొన్నారు. జూన్‌లో ఉష్ణోగ్రత దీర్ఘకాలిక సగటు కంటే 1 డిగ్రీ సెల్సియస్‌ను అధిగమించడం ఇదే మొదటిసారి అని ఎన్‌వోఏఏ తెలిపింది. 'మేలో ఉద్భవించిన బలహీనమైన ఎల్ నినో పరిస్థితులు జూన్‌లో బలపడటం కొనసాగింది. సగటు కంటే ఎక్కువ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు భూమధ్యరేఖ పసిఫిక్ మహాసముద్రంలోకి తిరిగి వచ్చాయి' అని అది పేర్కొంది.

ఈపీఎఫ్‌ఓ అధికారిపై సీబీఐ కేసు

న్యూదిల్లీ: పీఎఫ్ క్లెయిమ్‌ల అక్రమాల కేసులో ముంబై కేంద్రంగా పనిచేస్తున్న ఈపీఎఫ్‌ఓ అధికారి, జెట్ ఎయిర్‌వేస్‌కు చెందిన 13 మంది మాజీ ఉద్యోగులపై సీబీఐ కేసు నమోదు చేసినట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. తమ ప్రావిడెంట్ ఫండ్ క్లెయిమ్‌ల పరిష్కారం కోసం ఈపీఎఫ్‌ఓ అధికారికి జెట్ ఎయిర్ వేస్ ఉద్యోగులు ముడుపులు చెల్లించారన్న ఆరోపణలపై కేసు నమోదైంది. కందివలి(ఇ)లో తన ప్రాంతీయ అకౌంట్స్ సెక్షన్ ఆఫీసులో సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మఛీంద్ర జగన్నాథ్ బమ్నే పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌ఓ) విజిలెన్స్ గుర్తించిన తర్వాత ఈ కేసును సీబీఐకి అప్పగించారు. తమ క్లెయిమ్‌లు పరిష్కరించుకోవడానికి వివిధ సంస్థల్లో పనిచేసిన ఉద్యోగుల నుంచి ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా బమ్నే, ఆయన భార్య ఖాతాల్లోకి పెద్దఎత్తున నిధులు వచ్చినట్లు విజిలెన్స్ గుర్తించింది. జెట్ ఎయిర్‌వేస్‌కు చెందిన 13 మంది ఉద్యోగుల ద్వారా బమ్నే, ఆయన భార్య ఖాతాల్లోకి రూ.1.77 లక్షలు వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు జరిపిన సీబీఐ...అక్రమాలు నిజమేనని తేలుస్తూ బమ్నే, ఆయన భార్య, మరో 13 మందిపై కేసు నమోదు చేసింది.

మణిపూర్‌పై మోదీ మౌనమేల: కాంగ్రెస్



న్యూదిల్లీ: మణిపూర్‌పై ప్రధాని నరేంద్రమోదీ మౌనాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. మణిపూర్‌లో కొనసాగుతున్న హింసపై పూర్తిగా మౌనం వహించాలని మోదీ ప్రతిన బూనినట్లు కనిపిస్తోందని విమర్శించింది. దిల్లీలో వరద పరిస్థితిపై మోదీ ఆందోళన వ్యక్తం చేయడం మంచిదేనని, అదే సమయంలో ఇప్పటికీ మండుతున్న మణిపూర్‌పై ఆయన ఎందుకు స్పందించడం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శుక్రవారం ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. దిల్లీలో వరద పరిస్థితి గురించి తెలుసుకోవడానికి పారిస్ నుంచి మోదీ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ఫోన్ చేశారని, దీనిపై ఆందోళన వెలిబుచ్చడం మంచిదేనని, అమెరికాలో ఉన్న సమయంలో మణిపూర్ హింసపై ఎందుకు ఫోన్ చేయలేదని జైరాం రమేశ్ నిలదీశారు. ప్రధాని ఫ్రాన్స్‌లో ఉన్న ఇప్పుడు కూడా మణిపూర్ మండుతోందని గుర్తుచేశారు. మణిపూర్‌లో స్పందించాల్సిందిగా మోదీని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు.

'నేను'కు బదులు 'మనం' భావన ముఖ్యం

రాజస్థాన్ అసెంబ్లీలో రాష్ట్రపతి ప్రసంగం

జైపూర్: తమ కోసం కాకుండా...దేశం, సమాజం అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు ఆలోచించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హితవు పలికారు. 'నేను'కు బదులుగా 'మనం' అని అందరూ అనుకోవాలని సూచించారు. ద్రౌపది ముర్ము శుక్రవారం రాజస్థాన్ అసెంబ్లీలో ప్రసంగించారు. రాజస్థాన్ అసెంబ్లీ సమావేశాలు నేడు తిరిగి ప్రారంభమయ్యాయి. జనవరి 23న ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు మార్చి 21న నిరవధికం వాయిదా పడ్డాయి. అయితే సమావేశాలను ప్రొరోగ్ చేయకపోవడంతో స్పీకర్ సీపీ జోషి తిరిగి సమావేశపరిచ్చారు. శాసనసభ్యులను ఉద్దేశించి ముర్ము ప్రసంగిస్తూ కొన్నిసార్లు ప్రజలపై నాయకుల ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని, నాయకుల మాదిరిగా ఉండటానికి ప్రజలు ప్రయత్నిస్తారని చెప్పారు. దేశం కోసం, రాష్ట్రం కోసం, సమాజం కోసం, మహిళలు, యువత కోసం నాయకులు ఏమి చేస్తున్నారో ప్రజల చూస్తారన్నారు. ప్రజలు కేంద్రంగా ప్రజాప్రతినిధులు పనిచేయడమే కాకుండా ఆలోచనలు కూడా అలాగే ఉండాలని విజ్ఞప్తి చేశారు. 'నేను'కు బదులు 'మనం' అనే భావన ప్రతి ఎమ్మెల్యేకు ఉండాలన్నారు. ఎవరి గురించి వారు ఆలోచించుకుంటే దేశం, సమాజం ఎప్పటికీ అభివృద్ధి చెందదని ఆమె పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా తమకు బాధ్యతలు కట్టబెట్టిన ప్రజల కోసం మనం ఏమి చేస్తున్నామో మనకు మనమే ఆలోచించుకోవాలన్నారు. గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా, స్పీకర్ జోషి కూడా మాట్లాడారు.

అనర్హత వేటు ప్రక్రియను వేగవంతం చేయండి

మహారాష్ట్ర స్పీకర్‌కు సుప్రీం నోటీసులు

శివసేన (యూబీటీ) నాయకుడు వెల్లడి

ముంబై : ఉద్ధవ్ ఠాక్రేపై తిరుగుబాటు చేసిన 16 మంది ఎమ్మెల్యేల అనర్హత వేటు ప్రక్రియను వేగవంతం చేయాలని మహారాష్ట్ర శాసనసభ స్పీకర్ రాహుల్ నార్వేకర్‌కు సుప్రీం కోర్టు నోటీసులిచ్చిందని శివసేన (యూబీటీ) చీఫ్ విప్ సునీల్ ప్రభు శుక్రవారం తెలిపారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఇతర సేన ఎమ్మెల్యేలపై దాఖలయిన అనర్హత పిటిషన్లపై త్వరితగతిన తీర్పు చెప్పేలా ఆదేశించాలని కోరుతూ ప్రభు చేసిన విజ్ఞప్తిపై శాసనసభ స్పీకర్ కార్యాలయం నుంచి ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం స్పందన కోరింది. 16 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే ప్రక్రియను వేగవంతం చేయాలని స్పీకర్‌కు నోటీసులిచ్చిందని, నిర్ణయం తీసుకోవడంలో జాప్యానికి గల కారణాలను కోర్టు స్పీకర్‌ను అడిగిందని సునీల్ ప్రభు పీటీఐకి తెలిపారు. ప్రభు పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు ధర్మాసనం... 'మేము రెండు వారాల్లో వాపసు నోటీసును జారీ చేస్తాము' అని తెలిపింది.

2022 జూన్‌లో ఠాకరే నేతృత్వంలోని మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ప్రభుత్వం కూలిపోవడానికి కారణమైన వారి తిరుగుబాటు కారణంగా షిండే, 15 మంది సేన ఎమ్మెల్యేలపై ప్రభు అనర్హత పిటిషన్‌ను దాఖలు చేశారు. ఆ తర్వాత షిండే బీజేపీతో పొత్తు పెట్టుకుని సీఎం అయ్యారు. శివసేనకు సంబంధించి మహారాష్ట్రలో గత ఏడాది రాజకీయ సంక్షోభంపై సుప్రీం కోర్టు

మే 11న తీర్పు వెలువరించినప్పటికీ స్పీకర్ నార్వేకర్ ఉద్దేశపూర్వకంగా అనర్హత ప్రక్రియను ఆలస్యం చేస్తున్నారని సుప్రీం కోర్టులో ప్రభు పిటిషన్ ఆరోపించింది. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా షిండే కొనసాగుతారని మే 11న సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. షిండే తిరుగుబాటు నేపథ్యంలో బలపరీక్షను ఎదుర్కోకుండానే అప్పటి సేన అధ్యక్షుడు రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నందున థాకరే నేతృత్వంలోని ఎంవీఏ సంకీర్ణ ప్రభుత్వాన్ని పునరుద్ధరించలేమని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. సీఎం షిండేతో సహా 16 మంది తిరుగుబాటు సేన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి నిరాకరించిన కోర్టు, ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం అనర్హత పిటిషన్లను సాధారణంగా తీర్పు ఇవ్వలేమని పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న అంశంపై 'సహేతుకమైన వ్యవధిలో' నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ రాహుల్ నార్వేకర్‌ను ఆదేశించింది.

విజయవంతం చేద్దాం

ఏఐడీఆర్‌ఎం జాతీయ సమితి సమావేశాలను

సన్నాహక సమావేశంలో జల్లి విల్సన్ పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం(ఏఐడీఆర్‌ఎం) జాతీయ సమితి సమావేశాలు ఆగస్టు 5, 6 తేదీలలో విజయవాడలో జరగనున్నాయని, జాతీయ నాయకత్వం నిర్దేశించే కార్యక్రమాల అమలుకు దళిత శ్రేణులు సంసిద్ధులు కావాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పిలుపునిచ్చారు. ఏఐడీఆర్‌ఎం సమావేశాలు విజయవాడలో జరగనున్నందున దాసరి భవన్‌లో శుక్రవారం దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యవర్గ సన్నాహక సమావేశం జరిగింది. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జల్లి విల్సన్ మాట్లాడుతూ మోదీ పాలనలో దళితులు, మైనారిటీలు, మహిళలపై దాడులు, హత్యలు పెరుగుతున్నాయని విమర్శించారు. అత్యాచార నిరోధక చట్టాలను నీరుగారుస్తున్నారని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడు తోందన్నారు. ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరించడం ద్వారా రిజర్వేషన్లు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎస్సీలకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలను రద్దు చేసిందని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీల ప్రమోషన్లలో ఉద్యోగుల ప్రయోజనాలకు విఘాతం కలిగించడాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. దళితుల సమస్యలను చర్చించి దేశవ్యాప్త కార్యాచరణకు దిగాలని జల్లి విల్సన్ స్పష్టం చేశారు. ఏఐడీఆర్‌ఎం జాతీయ అధ్యక్షుడు ఎ.రామమూర్తి(పుదుచ్చేరి), జాతీయ ప్రధాన కార్యదర్శి వీఎస్ నిర్మల్(ఉత్తరప్రదేశ్) సహా అనేక మంది జాతీయ నాయకులు పాల్గొంటారని తెలిపారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ గత సమావేశం నుంచి ఇప్పటి వరకు జరిగిన కార్యకలాపాలను వివరించారు. ఏఐడీఆర్‌ఎం జాతీయ సమితి సమావేశాల సందర్భంగా ఆగస్టు 5న ప్రెస్‌క్లబ్‌లో దళిత సమస్యలపై సెమినార్ జరుగుతుందన్నారు. సామాజిక, ఆర్థిక వివక్షపై డీహెచ్‌పీఎస్ అలుపెరుగని పోరాటాలు కొనసాగిస్తోందని ఉద్ఘాటించారు. సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.నాగరాజు, ఆర్.గురుదాస్, కళింగ లక్ష్మణరావు, ఎడ్ల గోసి, సంగుల పేరయ్య, కొడాలి ఆనందరావు, మునెయ్య, సునీల్ పాల్గొన్నారు.

మోదీకి ఫ్రాన్స్ అత్యున్నత పురస్కారం

ఈ గౌరవం దక్కిన మొదటి భారతీయ ప్రధాని

పారిస్: ఫ్రాన్స్ అత్యున్నత పురస్కారాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ అందుకున్నారు. ఆయనను ఎలిసీ ప్యాలెస్‌లో ఆ దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ సన్మానించారు. అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ లిజియన్ ఆఫ్ ఆనర్'ను అందుకున్న మొదటి భారతీయ ప్రధానిగా మోదీ నిలిచారు. దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా, ప్రిన్స్ ఆఫ్ వేల్స్- కింగ్ చార్లెస్, జర్మనీ మాజీ ఛాన్సలర్ ఏంజిలా మెర్కెల్, ఐరాస మాజీ ప్రధాన కార్యదర్శి బౌట్రోస్ బౌట్రోస్-ఘలి వంటి వారు పురస్కారగ్రహీతల్లో ఉన్నారు. పురస్కారాన్ని అందుకున్న తర్వాత ట్విట్టర్ మాధ్యమంగా మోదీ స్పందిస్తూ "గ్రాండ్ క్రాస్ ఆఫ్ లిజియన్ ఆఫ్ ఆనర్' వినయంగా స్వీకరిస్తున్నా. ఈ పురస్కారాన్ని అందుకోవడం 140కోట్ల మంది భారతీయులకు సన్మానం. ఇంతటి గౌరవమిచ్చినందుకు అధ్యక్షుడు మాక్రాన్, ఫ్రాన్స్ ప్రభుత్వం, ప్రజలకు కృతజ్ఞుడను. భారత్‌పై వారికున్న ప్రేమాభిమానానికి, మైత్రికి ఇది నిదర్శనం' అని పేర్కొన్నారు. భారత్-ఫ్రాన్స్ సంబంధాలకు మోదీ కట్టుబడి ఉండటానికి ప్రతీకగా ఆయనను అత్యున్నత పురస్కారంతో ఫ్రాన్స్ సన్మానించారని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జైశంకర్ ట్వీట్ చేశారు. ఈయన ప్రస్తుతం ఇండోనేసియా, జకార్తా పర్యటనలో ఉన్నారు. మోదీకి అందిన గౌరవం రెండు దేశాల భాగస్వామ్య స్ఫూర్తికి ప్రతిబింబమని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి ట్విట్టర్‌లో పేర్కొన్నారు. పురస్కార ప్రదానానికి ముందు అధ్యక్షుడు మాక్రాన్ దంపతులు ఎలిసీ ప్యాలెస్‌లో మోదీకి విందు ఏర్పాటు చేశారు. అంతకుముందు భారత సంతతి ప్రజలతో లా సైనె మునికాలేలో కలిసిన మోదీ దాదాపు గంట సేపు ప్రసంగించారు. ఫ్రాన్స్‌లోని మార్సిల్లెలో భారతీయ కాన్సులేట్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఐరోపా దేశంలో మాస్టర్స్ చేసే భారతీయ విద్యార్థులకు ఐదేళ్ల పోస్ట్-స్టడీ వర్క్ వీసాలిస్తామన్నారు. రెండు రోజుల ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా శుక్రవారం ఫ్రెంచ్ నేషనల్ డే వేడుకల్లో గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు జడ్జిలుగా భుయన్, భట్టి ప్రమాణం

Justice Ujjal Bhuyan Justice SV Bhatti

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ ఉజ్జల్ భుయన్, జస్టిస్ ఎస్.వెంకటనారాయణ భట్టి నియమితులయ్యారు. కొత్త న్యాయమూర్తులతో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్ శుక్రవారం దిల్లీలోని సుప్రీంకోర్టు ఆడిటోరియంలో ప్రమాణస్వీకారం చేయించారు. దీంతో సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్య 32కు చేరింది. అయితే సీజేఐతో కలిపి మొత్తం 34 మంది ఉండాలి. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భుయన్, కేరళ హైకోర్టు సీజే భట్టికి సర్వోన్నత న్యాయస్థానానికి న్యాయమూర్తులుగా పదోన్నతికి కేంద్రప్రభుత్వం ఈనెల 12న ఆమోదం తెలిపింది. దీంతో వీరి నియామకాలను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘువాల్ బుధవారం ప్రకటించారు. కాగా ఈనెల 5న వీరిద్దరి పేర్లను సుప్రీం కొలీజియం సిఫార్సు చేసింది. జస్టిస్ ఉజ్జల్ భుయన్ 1964, ఆగస్టు 2న జన్మించారు. 2011, అక్టోబరు 17 నుంచి గువహటి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆ కోర్టులోని న్యాయమూర్తుల్లో ఆయనే సీనియర్‌గా ఉన్నారు. 2022, జూన్ 28వ తేదీ నుంచి తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. న్యాయశాఖకు సంబంధించిన అనేక రంగాల్లో మంచి అనుభవం పొందారు. ముఖ్యంగా టాక్సేషన్‌లో పట్టుసాధించారు. ముంబై హైకోర్టు జడ్జిగా ఉండి ట్యాక్సేషన్‌తో పాటు అనేక అనేక కీలక కేసుల్లో తీర్పులిచ్చారు. జస్టిస్ ఉజ్జల్ భుయన్ మంచి న్యాయమూర్తి అని ఆయన నియామకాన్ని ప్రతిపాదించే క్రమంలో కొలీజియం కూడా ప్రశంసించింది. అలాగే, జస్టిస్ ఎస్.వెంకటనారాయణ భట్టి 1962, మే 6న జన్మించారు. 2013, ఏప్రిల్ 12న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. సీనియర్ మోస్ట్ జడ్జిగా నిలిచారు. 2022 ఆగస్టు నుంచి సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం లేకపోవడాన్ని పరిగణనలోకి తీసుకున్న కొలీజియం, జస్టిస్ భట్టి పేరును సుప్రీంకోర్టు జడ్జిగా ప్రతిపాదించింది. ఈయన 2019, మార్చిలో కేరళ హైకోర్టుకు బదిలీ కాగా 2023, జూన్ ఒకటో తేదీ నుంచి ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. న్యాయశాఖలోని అనేక శాఖలపై మంచి పట్టు సాధించిన జస్టిస్ భట్టి సర్వోన్నత న్యాయస్థానికి న్యాయమూర్తి మంచి సేవలు అందించగలరని కొలీజియం పేర్కొంది.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల

వేతన సిఫార్సులు అమలు చేయాలి

కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్

న్యూఢిల్లీ: బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు వేతన సిఫార్సులు అమలు చేయాలని కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ వేతనాల చెల్లింపునకు సంబం ధించి గతకాలాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని అమలు చేయాలని కోరింది. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు కార్పొరేట్ వ్యవస్థలకు అనుకూల విధానాలు అమలుచేస్తూ బీఎస్ఎన్ ఎల్‌ను పోటీలో లేకుండా గొంతునొక్కి చంపేస్తోందని విమర్శించింది. ఈ విధానాలకు స్వస్తిచెప్పి... కమ్యూనికేషన్ల రంగంలో పోటీపడే వ్యాపార సంస్థలన్నింటికీ ఒకేవిధమైన నిబంధనలు అమలు చేస్తూ బీఎస్ఎన్ఎల్‌కు కనీసం న్యాయబద్ధమైన అవకాశాలు ఇవ్వాలని ఐక్యవేదిక డిమాండ్ చేసింది. బీఎస్ఎన్ఎల్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు ఆందోళనలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఐక్యవేదిక ఒక ప్రకటనలో పేర్కొంటూ న్యాయం కోసం పోరాటం చేయడానికి ఉద్యోగులకు సంపూర్ణ హక్కులు ఉన్నాయని స్పష్టంచేసింది. ఉద్యోగులు జులై 7న దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సామూహికంగా నిరసన ప్రదర్శనలు చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. బీఎస్ఎన్ఎల్ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని, ఈ రంగంలో ఉన్న మిగిలిన ప్రైవేటు సెల్‌ఫోన్ ఆపరేటర్లు వ్యాపా రంలో 5జీ విక్రయా లతో ముందుకు దూసుకు పోతుంటే... బీఎస్ఎన్ఎల్‌కు ఇంతవరకూ 4జీ అనుమతులు కూడా ఇవ్వలేదని విమర్శించింది. ఈ సేవల కోసం బీఎస్ఎన్ఎల్ నానా అగచాట్లు పడుతోందని తెలిపింది. మరోవైపు అందులో పనిచేసే ఉద్యోగులు వేతన ఒప్పందాల అమలు కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొంది. ఉద్యోగులతో సంప్రదింపులు జరపడానికి కేంద్ర ప్రభుత్వం 2018లో వేతన కమిటీని ఏర్పాటు చేసింది. అదే సంవత్సరం జులై 27న ఈ కమిటీ ఉద్యోగులతో ఒక ఒప్పందానికి వచ్చింది. కానీ ఇప్పటివరకూ ఈ ఒప్పందాలను అమలు చేయలేదు. మరోవైపు వ్యాపారంలో బీఎస్ఎన్ఎల్ పట్ల కేంద్రం చిన్నచూపు చూస్తూ ప్రైవేటు ఆపరేటర్లకు అనుకూల విధానాలు అవలంబిస్తోంది. కేంద్ర ప్రభుత్వ నినాదం సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా ప్రయాస్‌గా మారిందని విమర్శించింది.

17 వరకు అరెస్టు చేయవద్దు

న్యూఢిల్లీ: హింసతో అతలాకుతలమైన మణి పూర్‌కు నిజనిర్ధారణ కమిటీగా వెళ్లిన మహిళా నేతలపై ఆ రాష్ట్ర ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. అందులో ఓ మహిళా న్యాయవాది కూడా ఉన్నారు. ఈ కేసులో ఆ మహిళా న్యాయవాదిని జులై 17వ తేదీ వరకు అరెస్టు చేయవద్దని సుప్రీంకోర్టు మణిపూర్ పోలీసులను ఆదేశించింది. ఈ కేసులో మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరు కావాల్సి ఉందని, అయితే ఆయన రాకపోవడంతో కేసు విచారణను జులై 17వ తేదీ వరకు సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ మనోజ్ మిశ్రా ఈ కేసుతో కూడిన ధర్మాసనం కేసును విచారించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున కోర్టుకు పిటిషన్లు దాఖలు చేయలేదని, అందువల్ల కేసు విచారణను జులై 17వ తేదీకి లిస్టు చేస్తున్నామని ధర్మాసనం తెలిపింది. మణిపూర్‌లో జరుగుతున్న హింసను ప్రభుత్వమే ప్రోత్సహిస్తున్నదని మహిళా నేతల నిజనిర్ధారణ బృందం సభ్యులు ఆరోపించారని పేర్కొంటూ ఆ నేతలపై రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రముఖ న్యాయవాది దీక్ష ద్వివేదిని నింది తురాలిగా పేర్కొన్నారు. దీక్ష ద్వివేదిని అరెస్టు చేయవద్దని జులై 11న సుప్రీంకోర్టు ఒకసారి ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలు అందించాలని మణిపూర్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశిం చింది. శుక్రవారం ఈ వివరాలు అందించాల్సి ఉన్నప్పటికీ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు గైర్హాజరయ్యారు. దీంతో దీక్ష ద్వివేదిని 17వ తేదీ వరకు అరెస్టు చేయవద్దని ధర్మాసనం మరోసారి ఆదేశించింది. దేశానికి వ్యతిరేకంగా యుద్ధం చేసేలా మహిళా నేతలు మాట్లాడారని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. హింసతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేయడానికి సీపీఐ నేత, ఎన్ ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి అనీ రాజా, సీనియర్ న్యాయవాది దీక్ష ద్వివేది, రాజస్థాన్ సీపీఐ నేత నిషాలతో కూడిన బృందం అక్కడికి వెళ్లింది. ఆ ముగ్గురిపై పోలీసులు గతవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీక్ష ద్వివేది తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదనలు వినిపించారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకే దీక్ష ద్వివేదికి రక్షణ కల్పించారని సిద్ధార్థ్ దవే ధర్మాసనం దృష్టికి తీసుకొ చ్చారు. ద్వివేదికి రక్షణ కల్పిస్తామని, అదే సమయంలో ఈ కేసుపై హైకోర్టుకు వెళ్లే స్వేచ్ఛ కూడా మీకు ఉందని ధర్మాసనం తెలిపింది.

'యూనివర్సిటీ' చిత్రం నేటి విద్యారంగానికి ప్రతిరూపం

విశాలాంధ్ర- విజయవాడ (గాంధీ నగర్) : నేటి విద్యా రంగంలో చోటు చేసుకుం టున్న ఆధిపత్య ధోరణుల వలన విద్యార్థులు, తల్లి దండ్రులు పడుతున్న మానసికవేదనను తెలియ జేస్తూ రూపొందించిన చిత్రం యూనివర్సిటీ అని, దీనిని మరలా వచ్చే నెలాఖరులో విడుదల చేస్తున్నామని, ప్రతి ఒక్కరు చూసి ఆశీర్వదించాలని నటుడు, నిర్మాత, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెలలో చిత్రాన్ని విడుదల చేశామని, ఆ సమయంలో రాష్ట్రంలో ఎండలు అధికంగా ఉండటంతో చిత్రానికి అనుకున్నంత ఆదరణ లభించలేదని తెలిపారు. అయితే చిత్రం చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని చెప్పారని అన్నారు. అనుకూలమైన సమయంలో మళ్లీ విడుదల చేయాలని అభిమానులు, ప్రజలు కోరటంతో తిరిగి విడుదల చేస్తున్నానని తెలిపారు. ఈ చిత్రంలో విద్యారంగంలో నేడు చోటు చేసుకుంటున్న పరిణామాలను వివరించటం జరిగిందన్నారు. విద్య, వైద్యం, న్యాయం అనేవి సేవా రంగాలని, వాటిని వ్యాపార కోణంలో చూడకూద న్నారు. కానీ నేడు అందుకు విరుద్ధంగా జరుగుతుందన్నారు. ముఖ్యంగా సమాజంలో కార్పొరేట్ సంస్థలు విద్యను వ్యాపారంగా మార్చేశాయని అన్నారు. ర్యాంకుల పోటీలో కార్పొరేట్ విద్యా సంస్థలు విలువలు వదిలేస్తూ, విద్యార్థులపై వత్తిడి తీసుకురావటంతో అది తల్లిదండ్రుల వరకు చేరుతుందన్నారు. కార్పొరేట్ సంస్థలు ర్యాంకుల కోసం మాల్ ప్రాక్టీసు, పేపర్ లీకేజ్‌లకు పాల్పడుతుండటంతో విద్యాప్రమాణాలు దిగజారు తున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో విద్యను, విద్యార్థిని కాపాడుకోవాలనే తపనతో ఈ 'యూనివర్సిటీ' చిత్రాన్ని నిర్మించినట్లు వివరించారు. ఇది ఏ ఒక్క రాష్ట్రానికి సంబంధించిన సమస్య కాదని, దేశవ్యాప్తంగా ఈ సమస్య ఉందన్నారు. ఇందులోని పాటలు గద్దర్ వంటి ప్రముఖులు పాడారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని తప్పకుండా చూడవలసిన అవసరం ఉందని నారాయణమూర్తి తెలిపారు.

పార్లమెంటు ముందుకు 21 బిల్లులు

న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో 21 బిల్లులు ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పార్లమెంటులో ప్రవేశపెట్టే బిల్లుల జాబితాను ప్రభుత్వం గురువారం వెల్లడించింది. అందులో అత్యంత వివాదాస్పదమైన దిల్లీ సర్వీసెస్ ఆర్డినెన్స్, డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణ బిల్లులు ప్రధానంగా ఉన్నాయి. పార్లమెంటు సమావేశాలు జులై 20న ప్రారంభమై...ఆగస్టు 11న ముగుస్తాయి. వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే 21 బిల్లులకు సంబంధించిన జాబితాను లోక్‌సభ సెక్రటరియేట్ విడుదల చేసింది. అందులో సినిమాల పైరసీ నియంత్రణ, సెన్సార్ సర్టిఫికేషన్‌కు సంబంధించి వయస్సు ఆధారిత కేటగిరీలు ముసాయిదా బిల్లు, నేషనల్ రీసెర్చి ఫౌండేషన్ ఏర్పాటు బిల్లు ఉన్నాయి. అలాగే జన విశ్వాస్ సవరణ బిల్లు, బహుళ రాష్ట్రాల సహకార సొసైటీల సవరణ బిల్లు కూడా ఉన్నాయి.

28న ప్రేక్షకుల ముందుకు 'బ్రో'

హైదరాబాద్: పవన్ కల్యాణ్, సాయిధరమ్ తేజ్ ప్రధానపాత్రల్లో సముద్రఖని దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'బ్రో' చిత్రం విడుదలకు ముస్తాబవుతోంది. ఈ వినోదాత్మక చిత్రం జులై 28న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఇటీవలే మైడియర్ మార్కండేయ అంటూ తొలి సింగిల్ ను వదిలిన బ్రో చిత్ర యూనిట్ ఇప్పుడు రెండో పాటకు రంగం సిద్ధం చేసింది. జాణవులే అంటూ సాగే ఈ రొమాంటిక్ పాటను శనివారం తిరుపతిలోని ఎస్వీఆర్ జయశ్యామ్ థియేటర్ లో ప్రేక్షకుల నడుమ విడుదల చేయనున్నారు. జులై 15న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఈ వేడుక షురూ కానుంది. ఈ చిత్రంలో కేతిక శర్మ, ప్రియా ప్రకాశ్ వారియర్ కథానాయికలు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ సినిమాకు డైలాగులు, స్క్రీన్ ప్లే అందించడం విశేషం. జీ స్టూడియోస్ తో కలిసి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ బ్రో చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రానికి తమన్ సంగీతం సమకూర్చారు.

'నాతో నేను' చిత్రం నుంచి ప్రత్యేక గీతం విడుదల

హైదరాబాద్: శాంతి కుమార్ తుర్లపాటి (జబర్దస్త్ ఫేం) దర్శకత్వంలో సాయికుమార్, ఆదిత్యా ఓం, రాజీవ్ కనకాల, శ్రీనివాస్ సాయి, దీపాలి రాజపుత్ ప్రధాన పాత్రధారులుగా ప్రశాంత్ టంగుటూరి నిర్మిస్తున్న చిత్రం 'నాతో నేను'. ఈ చిత్రంలోని రాజంపేట రాణిని అంటూ సాగే ప్రత్యేక గీతాన్ని శేఖర్ మాస్టర్ విడుదల చేశారు. సత్య కశ్యప్ సంగీతం అందించారు. శాంతి స్వరూప్ సాహిత్యం అందించిన ఈ పాటను గీతామాధురి ఆలపించారు. ఈ సందర్భంగా శేఖర్ మాస్టర్ మాట్లాడుతూ "జబర్దస్త్' ఆర్టిస్ట్‌గా శాంతి కుమార్ అందిరికీ పరిచయమే. ఇప్పుడు ఇంకో అడుగు ముందుకేసి సినిమా దర్శకత్వ బాధ్యత తీసుకున్నాడు. ఈ చిత్రంలోని 'రాజంపేట రాణిని' అంటూ సాగే మాస్ బీట్ పాటను చూశా. సంగీతం, కొరియోగ్రఫీ చాలా బాగుంది. ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్ముతున్నా. జబర్దస్త్ నుంచి వెళ్లిన వేణు 'బలగం' చిత్రంతో పెద్ద పేరు తెచ్చుకున్నాడు శాంతి కుమార్ మంచి గుర్తింపు తెచ్చుకుంటారని ఆశిస్తున్నా" అని అన్నారు. 'నాతో నేను' చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని ఈ నెల 21 ప్రేక్షకుల ముందుకు రానుందని నిర్మాత ప్రశాంత్ టంగుటూరి వెల్లడించారు.

అరంగేట్రంలోనే అదరగొట్టిన జైస్వాల్

డొమినికా: భారత యువ బ్యాటర్ యశస్వీ జైస్వాల్ అంతర్జాతీయ క్రికెట్ అరంగేట్రంలోనే సత్తా చాటాడు. ఆడుతున్న తొలి టెస్టులోనే 171 పరుగులు సాధించాడు. భారత టెస్టు చరిత్రలో అరంగేట్రంలో విదేశీ గడ్డపై శతకం బాదిన ఓపెనర్‌గా రికార్డు పుటల్లోకి ఎక్కాడు. సంయ మనం, నిలకడ, దూకుడు కలబోసిన ఆటతీరుతో కరేబియన్ బౌలర్లను దీటుగా ఎదుర్కొని సుదీర్ఘ సమయం క్రీజులో నిలిచాడు. అటు కెప్టెన్ రోహిత్ శర్మ (103) కూడా చాలా రోజుల తర్వాత బ్యాట్‌కు పనిచెబుతూ శతకం సాధించి జట్టు భారీ స్కోరుకు దోహదపడ్డాడు. ఫలితంగా వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత జట్టు మూడోరోజు శుక్రవారం భోజనం విరామం సమయానికి నాలుగు వికెట్ల నష్టానికి 400 పరుగులు చేసింది. క్రీజులో విరాట్ కోహ్లి (72), రవీంద్ర జడేజా (21) ఉన్నారు. ఇప్పటికే టీమిండియాకు 250 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. అంతకు ముందు విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులకు ఆలౌటైన సంగతి విదితమే. రెండో రోజు వికెట్ నష్టపోకుండా 80 పరుగులతో బ్యాటింగ్ కొనసాగించిన ఓపెనర్లు యశస్వీ, రోహిత్ విండీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ క్రీజులో నిలిచారు. అరంగేట్ర హీరో యశస్వీ కరేబియన్ గడ్డపై ఆత్మవిశ్వాసం కనబర్చాడు. ఆడుతోంది తొలి టెస్టు అనే భావన కనిపించనీయలేదు. అటు రోహిత్ కూడా చాలా రోజుల తర్వాత ఆకట్టుకున్నాడు. అయుతే తొలిరోజు మాదిరి వేగం కనిపించలేదు. స్లో పిచ్ కావడంతో విండీస్ స్పిన్నర్లు కార్న్‌వాల్, వారికన్ సుడులు తిరిగే బంతులతో విసిగించారు. దీంతో మొదటి సెషన్ 32 ఓవర్లలో 66 పరుగులు మాత్రమే వచ్చాయి. కానీ ఓపిగ్గా క్రీజులో నిలిచిన రోహిత్, యశస్వీ అర్ధసెంచరీలు సాధించి వికెట్‌ను కోల్పోకుండా లంచ్ విరామానికి వెళ్లారు. రెండో సెషన్ ఆరంభంలో భారత్ ఆటలో జోరు పెరిగింది. యశస్వీ, రోహిత్ అడపాదడపా బౌండరీలు రాబట్టడంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంలోకి వెళ్లింది. ఇదే జోరుతో మొదట జైస్వాల్ తొలి శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అటు మరింత ఓపిగ్గా ఆడిన రోహిత్ చక్కటి ఫోర్‌తో టెస్టుల్లో పదో శతకం పూర్తి చేసుకున్నాడు. అయితే మరుసటి బంతికే అథనజె అతడి వికెట్ తీయడంతో తొలి వికెట్‌కు 229 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. వన్‌డౌన్ వచ్చిన గిల్ (6) వారికన్ బౌలింగ్‌లో అథనజెకు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. వెస్టిండీస్‌పై భారత్ తరపున తొలి వికెట్‌కు అత్యధిక భాగస్వామ్యం (229) అందించిన జోడీగా రోహిత్-యశస్వీ నిలిచారు.

యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్

క్వార్టర్స్‌లో లక్ష్యసేన్, సింధు

కౌన్సిల్ బఫ్స్ (అమెరికా): యూఎస్ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్‌లో భారత షట్లర్లు జోరు కొనసాగిస్తున్నారు. ఈమధ్యే కెనడా ఓపెన్ చాంపియన్‌గా నిలిచిన లక్ష్యసేన్ పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టాడు. మహిళల సింగిల్స్‌లో అదరగొడుతున్న పీవీ సింధు కూడా క్వార్టర్స్‌కు చేరింది. సూపర్ ఫామ్‌లో ఉన్న లక్ష్యసేన్.. ప్రీ క్వార్టర్స్‌లో చెక్ రిపబ్లిక్ ఆటగాడు జాన్ లౌడాపై 21-8, 23-21తో గెలుపొందాడు. లక్ష్యసేన్ సెమీస్ బెర్తు కోసం భారత్‌కే చెందిన 19 ఏళ్ల ఎస్ శంకర్ ముత్తుస్వామిని శనివారం ఢీ కొట్టనున్నాడు. కాగా ఈ సీజన్‌లో ఒక్క ట్రోఫీ నెగ్గని ఒలింపిక్ విజేత సింధు పతకంపై ఆశలు రేపుతోంది. గురువారం జరిగిన ప్రీక్వార్టర్ మ్యాచ్‌లో ఆమె తైవాన్‌కు చెందిన సంగ్ షువో యున్‌పై సునాయాసంగా గెలుపొందింది. వరుసగా రెండు సెట్లలో ఆధిపత్యం చెలాయించిన భారత షట్లర్ 21-14, 21-12తో సంగ్ షువోను చిత్తుగా ఓడించింది. సింధు క్వార్టర్ ఫైనల్లో చైనా క్రీడాకారిణి గావో ఫాంగ్ జీతో తలపడనుంది.

ఆసియా క్రీడల్లో తటస్థంగానే రష్యా క్రీడాకారుల పోటీ

న్యూఢిల్లీ: ఈ ఏడాది చైనాలో జరిగే ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడల్లో రష్యా, బెలారస్ దేశాలకు చెందిన ఆటగాళ్లు తటస్థంగా పోటీపడనున్నారు. వాస్తవానికి వాళ్లు తమ తమ దేశాల తరపున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంది. కానీ, ఉక్రెయిన్‌పై రష్యా ముమ్మర దాడులకు నిరసనగా అంతర్జాతీయ ఒలింపిక్ సమాఖ్య(ఐఓసీ) ఈ నిర్ణయం తీసుకుంది. చైనా వేదికగా సెప్టెంబర్‌లో జరుగనున్న ఈ ప్రతిష్ఠాత్మక క్రీడా సంబురంలో రష్యా, బెలారస్ నుంచి 500 మందికి మాత్రమే ప్రాతినిధ్యం కల్పిస్తున్నట్లు పేర్కొంది. గత శనివారం బ్యాంకాక్ వేదికగా సమావేశమైన ఆసియా ఒలింపిక్ కౌన్సిల్(ఓసీఏ)... రష్యా, బెలారస్ దేశాల అథ్లెట్ల పోటీపై ఓ నిర్ణయానికి వచ్చింది. ఈ రెండు దేశాలకు చెందిన అథ్లెట్లు తటస్థ పతాకం కింద వ్యక్తిగతంగా పోటీపడాల్సి వస్తుందని వోసీఏ డైరెక్టర్ జనరల్ హుస్సేన్ అల్ ముసల్లామ్ స్పష్టం చేశాడు. అయితే.. తటస్థ ప్రాతినిధ్యమనేది వ్యక్తిగతంగా మాత్రమే ఉంటుందని, ఇది జట్లకు వర్తించదని ఓసీఏ కౌన్సిల్ స్పష్టం చేసింది. అంతేకాదు.. ఆసియా క్రీడలు జరుగుతుండగా యుద్ధానికి మద్దతుగా గానీ లేదా వ్యతిరేకంగా ఎలాంటి గుర్తులు ప్రదర్శించరాదని రష్యా, బెలారస్ ఆటగాళ్లకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ రెండు దేశాల నుంచి ఆసియా క్రీడలకు రాజకీయ నాయకులను ఆహ్వానించడం లేదని నిర్వాహకులు తెలిపారు. కరోనా వైరస్ విజృంభణ కారణంగా ఏడాది ఆలస్యంగా ఆసియా క్రీడలు జరుగుతున్నాయి. వివిధ దేశాల నుంచి దాదాపు 10 వేల మంది క్రీడాకారులు అనేక అంశాల్లో పోటీ పడనున్నారు.

ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

షాట్‌పుట్‌లో తేజిందర్‌పాల్‌కు స్వర్ణం

బ్యాంకాక్: ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో భారత స్టార్ షాట్ పుట్ క్రీడాకారుడు తేజిందర్‌పాల్ సింగ్ తూర్ (28) దుమ్ము రేపాడు. వరుసగా రెండోసారి బంగారు పతకం గెలిచాడు. షాట్‌పుట్ పోటీలో తనకు ఎదురులేదని మరోసారి నిరూపించాడు. బ్యాంకాక్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో తేజిందర్‌పాల్ తొలి ప్రయత్నంలోనే షాట్‌పుట్‌ను 20.23 మీటర్ల దూరం విసిరాడు. ఇరాన్‌కు చెందిన సబేరి మెహ్ది(19.98 మీటర్లు), కజకిస్థాన్ అథ్లెట్ ఇవన్ ఇవనోవ్ (19.87 మీటర్ల) వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కిం చుకున్నారు. ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తేజిందర్‌పాల్‌కు మంచి రికార్డు ఉంది. 2019లో అతను 20.22 మీటర్లతో స్వర్ణం సాధించాడు. 2017లో తేజిందర్ రజత పతకంతో సత్తా చాటాడు. గత నెలలో భువనేశ్వర్‌లో జరిగిన నేషనల్ ఇంటర్ స్టేట్ చాంపియన్‌షిప్ లో రికార్డు నెలకొల్పిన విషయం తెలిసిందే. ఆ పోటీల్లో 21.77 మీటర్ల దూరం విసిరిన తేజిందర్‌పాల్ వరల్డ్ చాంపియన్‌షిప్స్ కు అర్హత సాధించాడు. బుడాపెస్ట్‌లో అగస్టు 17 నుంచి 27 వరకు షార్ట్‌పుట్ ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.